


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162


**ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు.. ఏఐ స్కిల్స్ తప్పనిసరి**




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 252 | శనివారం 19 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3


# దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..
# రూ.15 వేల కోట్ల పెట్టుబడి!



**దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ - ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ**

**ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి - 45 వేల మందికి ఉపాధి అవకాశాలు**

**ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం**

మిగతా2లో

ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్‌ఎస్‌హెచ్‌ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది.వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు,

# 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..
# ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా

ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం

మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు

ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు

రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం

కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం



# అంబటి రాంబాబుకు మరో షాక్..



**విచారణకు రావాలంటూ ఈడీ నోటీసులు**

అంబటికి ఈ నెల 11వ తేదీన ఈడీ నోటీసులు

విచారణకు హాజరు కావాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్న వైనం

అయితే ఆ నోటీసులు తనకు అందలేదన్న అంబటి

దాంతో, నేడు ఫోన్ ద్వారా సమాచారం అందించిన అధికారులు

ఇప్పటికే అంబటిపై పలు కేసులు నమోదు

## మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి రూ,213 కోట్లతో టెండర్లు..





వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ,213 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం నాడు టెండర్లు ఆహ్వానించింది. నవంబర్ మూడో తేదీలోగా టెండర్ బిడ్లు దాఖలు చేసేందుకు చివరి తేదీగా నిర్ణయించింది. 18 నెలల కాలపరిమితి విధించింది. ఈ నిధులతో డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్,ఏటీసి టవర్, విద్యుత్ సబ్ స్టేషన్, ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు.

# ఉప ఎన్నికలకు నేను సిద్ధం

**హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదన్న దానం**

తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన దానం నాగేందర్.. ఖైరతాబాద్ నియోజకవర్గానికి

2లో



## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

2లో

- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు,
- భూకబ్జాలకు ఆధారాలుంటే వెంటనే స్వాధీనం చేసుకోవాలి,
- కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులపై చర్యలు తీసుకోవాలి,
- ఆరు గ్యారంటీల అమలుపై నుంచి దృష్టి మళ్లించేందుకే డ్రామాలు,- బండి,
- కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై కేంద్ర మంత్రి తీవ్ర విమర్శలు,



సిద్దిపేట భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సిద్దిపేట భూముల విషయంలో భూకబ్జాలకు సంబంధించి ఆధారాలు ఉంటే ప్రభుత్వం వెంటనే ఆ భూములను

# ఉల్లి ధరల మంటతో సామాన్యుడి కంట కన్నీళ్లు

- కిలో కొనేందుకే జేబు చూసుకోవాల్సిన దుస్థితి,
- పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం,
- రోజురోజుకూ పెరుగుతున్న ఉల్లి ధరలు,
- వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్న ఉల్లి,
- ఉల్లి ధరల పెరుగుదలతో వినియోగదారుల ఆందోళన,
- కిలోకు రూ.120 దాటిన ధర..
- కొనుగోలుకు వెనుకడుగు

అవసరానికి తగ్గట్టే ఉల్లి కొనుగోలు,
- సరఫరా తగ్గితే ధరలకు రెక్కలు,
- రవాణా, మార్కెట్ వ్యయాల ప్రభావమా?
- మధ్యవర్తుల దందాపై వినియోగదారుల అనుమానాలు,
- రైతు నుంచి మార్కెట్ వరకు పెరుగుతున్న ధరల అంతరం,
- ధరలు పెరిగినా రైతుకు దక్కుతున్నదెంత?
- నిల్వలు, సరఫరాపై అధికారుల నిఘా అవసరం,
- ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్,
- పండుగల వేళ మరింత పెరిగే అవకాశం ఉందా?
- నిత్యావసరంగా మారిన ఉల్లి..
- భారంగా మారిన ధర

కూరగాయల మార్కెట్‌లో ఉల్లి ధరలే హాట్ టాపిక్,
- పెరుగుతున్న ధరలతో హోటళ్లు, చిన్న వ్యాపారులపైనా ప్రభావం,
- ధరలు తగ్గే రోజెప్పుడోనని ఎదురుచూపులు,
- ఉల్లి ధరలపై ప్రభుత్వ జోక్యం కోరుతున్న వినియోగదారులు,
- ధరల స్థిరీకరణకు సరఫరా వ్యవస్థ పటిష్టం చేయాలి,
- మార్కెట్‌లో ధరల వ్యత్యాసాలపై ప్రశ్నలు,
- ఉల్లి ధరల పెరుగుదలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి,
- వంటింటి కన్నీళ్లకు తెరపడేదెప్పుడు?







# జన్వాడ ఫామ్‌హౌస్ నాది..
# కేటీఆర్‌కు సంబంధం లేదు

జన్వాడ ఫామ్‌హౌస్ తనదేనని స్పష్టం చేసిన యజమాని ప్రదీప్ రెడ్డి

కేటీఆర్‌కు కేవలం లీజుకు మాత్రమే ఇచ్చానని వెల్లడి

ఫామ్‌హౌస్ కు సంబంధించి ఎలాంటి భూ వివాదాలు లేవని స్పష్టీకరణ

రాజకీయ పార్టీల నేతలు తనిఖీకి రావడం సరికాదని వ్యాఖ్య

చట్టప్రకారం ఏ విచారణకైనా సహకరిస్తానని హామీ

2లో

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన జన్వాడ ఫామ్‌హౌస్ వివాదంపై దాని యజమాని ప్రదీప్ రెడ్డి స్పందించారు. ఆ ఫామ్‌హౌస్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి సంబంధం లేదని,

# ఆరు నూరైనా.. వెనక్కి తగ్గం!..





అధికారాన్ని అడ్డం పెట్టుకుని గతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. "ఆరు నూరైనా భూ దురాక్రమణలపై చర్యలు తీసుకుంటాం" అని తేల్చి చెప్పారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ భూముల విషయంలో పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తామని తెలిపారు.

కేసీఆర్ కుటుంబం భూ వ్యవహారాలపై చర్యలు తప్పవు

బీఆర్ఎస్ నేతల ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటాం

ఆ భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

2లో

రికార్డుల పరిశీలన తర్వాత వాస్తవాలు బయటపెడతాం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## 'ప్రజాస్వామ్యం' కన్నీరు తుడిచిన హైకోర్టు!..

2లో

## ఫిరాయింపులకు ఫుల్‌స్టాప్?

ప్రజా ప్రాతినిధ్య చట్టంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు

స్పీకర్ ట్రిబ్యునల్ నిర్ణయానికి భిన్నంగా హైకోర్టు తీర్పు

ఎమ్మెల్యేల పార్టీ మార్పులపై కీలక సంకేతాలు

తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో మార్పులకు అవకాశం



నంది పత్రిక
19 శనివారం సెప్టెంబర్ 2026

## ‘మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ’.. ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ‘మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్’ అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ‘ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా’ అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై ‘ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్’ పేరు, ‘ఫ్లవర్స్ అండ్ గ్రాస్’ గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ. 29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ. 9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## అంబటి రాంబాబుకు మరో షాక్..

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఈ నెల 11వ తేదీనే నోటీసులు పంపినట్టు ఈడీ అధికారులు ఆయనకు నేడు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే తనకు నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు అంబటి తెలిపారు. దీంతో, విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ ఆయనకు అధికారులు స్పష్టం చేశారు. పలు వివాదాస్పద అంశాలు, చట్టపరమైన కేసుల్లో వార్తల్లో నిలిచిన ఆయనకు, ఈడీ నేరుగా సమన్లు జారీ చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.గతంలోనే అంబటి రాంబాబుపై పలు పోలీస్ కేసులు నమోదు కావడంతో పాటు, ఆయన సుమారు 18 రోజుల పాటు రిమాండ్‌లో కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై తిరుపతి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి విచారణకు రావాలని ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి తోడు ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం గమనార్హం. మరోవైపు, అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు రావడంపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి తమ నేతలపై కుట్రపూరితంగా కేసులు బనాయిస్తోందని ఆరోపిస్తున్నారు.



## ఓబీసీలకు మరో పోరాటం తప్పదు!

భారతదేశంలో అసమానత గురించి మాట్లాడినప్పుడల్లా పేదరికం, నిరుద్యోగం, ఆదాయం వంటి అంశాలే ఎక్కువగా చర్చకు వస్తాయి. కానీ అంతకంటే ముఖ్యమైన ప్రశ్నలు వేరే ఉన్నాయి. దేశ సంపద ఎవరి చేతుల్లో ఉంది? పెద్ద వ్యాపారాలు, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మీడియా సంస్థలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? భారీ మైనింగ్, రోడ్లు, విద్యుత్, రక్షణ, సాగునీటి కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయి? సుప్రీంకోర్టు, హైకోర్టులు, విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ అత్యున్నత అధికార పదవుల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత? ఈ అంశాలు పెద్దగా చర్చకు రావటం లేదు. దేశంలోని అత్యంత ధనికులైన ఒక శాతం మంది దాదాపు 40శాతం సంపదను కలిగి ఉండగా, దిగువన ఉన్న 50శాతం ప్రజల చేతుల్లో కేవలం 3శాతం సంపద మాత్రమే ఉన్నది. కానీ ఈ ఆర్థిక అసమానతకు సామాజిక రూపం ఏమిటో సమగ్ర సమాచారం లేదు. సంపదలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాటా ఎంత? అవకాశాల్లో వారి శాతం ఎంత? అధికార వ్యవస్థల్లో ఎవరు ముందున్నారు? ఎవరు వెనుకబడ్డారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగేదే నిజమైన కులగణన. అందుకే కులగణనను కేవలం ‘ఎవరు ఏ కులానికి చెందినవారు? వారి మొత్తం జనాభా ఎంత?’ అనే ఫక్తు సంఖ్యగా చూడటం పొరపాటు. సమగ్ర సామాజిక, ఆర్థిక ప్రాతిపదిక దృష్టితో చేపట్టే కులగణనే భారత సమాజానికి ఒక ఎక్స్‌రేలా ఉపయోగపడుతుంది. ఈ అంశాన్ని గత కొన్నేళ్లుగా రాహుల్‌గాంధీ జాతీయ రాజకీయ చర్చలోకి తెచ్చారు. కుల గణనను కేవలం జనాభా లెక్కల అంశంగా కాకుండా ప్రాతినిధ్యం, అవకాశాలు, అధికారంలో వాటా అనే ప్రశ్నగా ఆయన నిలబెట్టారు. దేశ జనాభాలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఎంతమంది? ప్రభుత్వంలో, ఉన్నత విద్యలో, న్యాయవ్యవస్థలో, మీడియా, కార్పొరేట్ రంగాల్లో వారి వాటా ఎంత? అనే ప్రశ్నలను ఆయన పదేపదే సంధిస్తున్నారు. ‘దేశానికి ఎక్స్‌రే అవసరం’ అన్న రాహుల్‌గాంధీ వాదన వెనకున్న భావన సరిగ్గా ఇదే. రాహుల్‌గాంధీ నిరంతరంగా కులగణన అవసరాన్ని నొక్కివక్కాణించడంతోపాటు, బిహార్, తెలంగాణ రాష్ట్రాలు కుల ఆధారిత సర్వేలు నిర్వహించడంతో రాబోయే జనగణనలో కులగణన చేపడతానని మోదీ ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. అప్పటివరకూ కులగణనపై వ్యతిరేక వైఖరితో ఉన్న బీజేపీ తీసుకున్న ‘యూటర్న్’ ఇది. ఆనాడు బిహార్‌లోని ఓబీసీఈబీసీ ఓటర్లను ఆకర్షించడం కూడా బీజేపీ నిర్ణయం వెనక రాజకీయ కారణాల్లో ఒకటి కావచ్చు. తెలంగాణలో సర్వేకు ముందుగా వివిధ సామాజిక వర్గాలు, సంఘాలు, నిపుణులు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరిగాయి. ఏ ప్రశ్నలు అడగాలి? ఏయే సామాజికఆర్థిక అంశాలను నమోదు చేయాలి? కుల గుర్తింపును ఎలా నమోదు చేయాలి? అనే విషయాలపై సూచనలు తీసుకున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన గెజిట్లలో ఉన్న కులాల జాబితాలను ఆధారంగా తీసుకుని వాటిని పద్ధతిగా వర్గీకరించారు. ప్రతి కులానికి ఒక ప్రత్యేక కోడ్ కేటాయించారు. ఒకే కులానికి ప్రాంతాల వారీగా వాడే వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, స్థానిక పేర్లు, సమానార్థక పేర్లను గుర్తించి అవన్నీ సంబంధిత కులానికి కేటాయించిన అదే కోడ్ కిందకు వచ్చేలా వ్యవస్థ రూపొందించారు. ఉదాహరణకు రజక, చాకలి, వన్నార్ వంటి వేర్వేరు పేర్లు ఒకే సామాజిక వర్గానికి సంబంధించినవిగా గుర్తించినప్పుడు అవి వేర్వేరు లెక్కలుగా విడిపోకుండా ఒకే ప్రామాణిక కోడ్ కింద నమోదయ్యేలా చేశారు. తెలంగాణలో సేకరించిన డేటాను కేవలం జనాభా లెక్కలుగా కాకుండా విద్య, ఉపాధి, జీవనోపాధి, ఆస్తులు, వ్యాపార యాజమాన్యం, సామాజిక స్థితి, ప్రాతినిధ్యం వంటి సూచికలతో విశ్లేషించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన నిపుణుల కమిటీ ఈ విశ్లేషణను చేపట్టి నివేదికను విడుదల చేసింది. 2026 ఆగస్టు 14న కేంద్రం విడుదల చేసిన సెన్సెస్ 2027 షెడ్యూలులోని కులం ప్రశ్న రూపకల్పనలోనే ప్రధాన సమస్య (లోపం) ఉంది. ఎస్సీ, ఎస్టీల విషయంలో అధికారికంగా గుర్తించిన జాబితాల ఆధారంగా క్రమబద్ధమైన వర్గీకరణకు అవకాశం ఉండగా, ఓబీసీలూ ఇతర కులాల విషయంలో మాత్రం వ్యక్తి చెప్పిన కులం పేరును ఓపెన్ టెక్స్ట్‌గా నమోదు చేసే విధానాన్ని ప్రతిపాదించారు. ఇది ఓబీసీలకు అన్యాయం చేసే కపట నాటకంగా కనిపిస్తున్నది. 2011 సామాజిక, ఆర్థిక కుల సర్వేలో 46 లక్షలకు పైగా వేర్వేరు కులాలు నమోదు కావడం ఇందుకు ఉదాహరణ. భారతదేశంలో 46 లక్షల కులాలు లేవు. ఒకే కులం వేర్వేరు పేర్లతో, ఉపకులాల పేర్లతో, ప్రాంతీయ పేర్లతో, సమానార్థక పేర్లతో నమోదు కావడంతో లెక్కలు విపరీతంగా చీలిపోయాయి. ఈ సమస్య కేంద్ర ప్రభుత్వానికి తెలియదని అనుకోవడానికి లేదు. 2021లో సుప్రీంకోర్టుకు కేంద్రం స్వయంగా ఇదే సమస్యలను వివరించింది. గత అనుభవంలో ఏ లోపాలు వచ్చాయో ప్రభుత్వానికి తెలుసు. వాటికి పరిష్కారం ఏమిటో కూడా తెలుసు. సామాజిక వర్గం, కులం రెండింటినీ విడిగా నమోదు చేయాలి (బీసీయాదవ మాదిరి). రాష్ట్రాలవారీగా అధికారికంగా గుర్తించిన కుల జాబితాలను ఉపయోగించాలి. ఒకే కులానికి ఉన్న వేర్వేరు పేర్లు, ఉపకులాలు, ప్రాంతీయ పేర్లను ఒకే కోడ్ కింద నమోదు చేయాలి. జాబితాలో లేని పేర్లకే స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం (ఓపెన్ టెక్స్ట్‌గా) ఇవ్వాలి. ఓబీసీల కులాలను సరైన జాబితాలు, కోడ్‌లు లేకుండా నమోదు చేస్తే ఒకే కులం వేర్వేరు పేర్లతో చీలిపోవచ్చు. అప్పుడు ఆ కులం జనాభా, దాని సామాజిక స్థితి, విద్య, ఉద్యోగాల్లో దాని ప్రాతినిధ్యం స్పష్టంగా తేలవు. ఇది తర్వాత పెద్ద సమస్యగా మారుతుంది. రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, సంక్షేమ విధానాల విషయంలో కోర్టులు నమ్మదగిన గణాంకాలను కోరుతున్నాయి. కానీ ఈ కులగణన పద్ధతి ఆదిలోనే బలహీనంగా ఉంటే విశ్వసనీయమైన డేటా ఎలా వస్తుంది? అప్పుడు నష్టపోయేది ఓబీసీలే! అందుకే కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడంతో ఓబీసీల పోరాటం ముగిసిపోలేదు. అసలైన రెండోదశ పోరాటం ఆవశ్యకత ఇప్పుడు ఎంతగానో ఉన్నది. కేవలం కులగణన జరగడం మాత్రమే కాదు. అది సరైన పద్ధతిలో సమగ్రంగా జరగాలి. ఎన్నికల సమయంలో ఓబీసీలను హిందూ ఐక్యత పేరుతో బీజేపీ తన రాజకీయ వ్యూహంలో భాగం చేస్తున్నది. కానీ అదే ఓబీసీలు విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, అధికారంలో ప్రాతినిధ్యం, వనరుల్లో వాటా గురించి ప్రశ్నిస్తే మాత్రం కపటత్వంతో కూడిన కొత్త షరతులను ముందుకు తెస్తున్నది. ఓబీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతోందా అన్నది పరిశీలించేందుకు రోహిణి కమిషన్ ఏర్పాటైంది.

## మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించండి

రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మంజూరు చేయాలని కోరారు.

**ఎల్‌నినో ప్రభావంపై చర్చ** సమావేశంలో రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. వర్షాభావం కారణంగా వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు.ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

## ఉప ఎన్నికలకు నేను సిద్ధం

ఉప ఎన్నిక వస్తే పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఎన్నికలు తనకు కొత్త కాదని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజల్లోకి వెళ్లి పోరాడతానని చెప్పారు.

“ఉప ఎన్నిక ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నాను. ఇక్కడి వరకు పోరాడుతూ వచ్చాను. ఇకపై కూడా పోరాడుతాను. ఈ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తాను” అని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు.

**ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున విజయం..** గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్ చేపట్టిన చేరికల నేపథ్యంలో ఆయన ఆ పార్టీలో చేరారు. దీంతో పార్టీ మార్పు అంశంపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ న్యాయపరమైన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు అనర్హత వేటుకు సంబంధించి తీర్పు వెలువరించింది. తీర్పు నేపథ్యంలో స్పందించిన దానం నాగేందర్.. ఉప ఎన్నికలు జరిగితే ప్రజాక్షేత్రంలో పోటీ చేసేందుకు సిద్ధమని తెలిపారు.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

స్వాధీనం చేసుకుని, కేసీఆర్ కుటుంబంతో పాటు బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారంటీల అమలు అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని బండి సంజయ్ ఆరోపించారు. కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేశారా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కేసీఆర్ రాజకీయ ప్రస్థానం అక్రమాలు, అవినీతి, భూదందాలతో నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూములకు యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందని వ్యాఖ్యానించారు.

**దండయాత్ర చేస్తాం..**సిద్దిపేట భూముల వివాదంపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలో దండయాత్ర చేపడతామని బండి సంజయ్ ప్రకటించారు. ఆక్రమిత భూములుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు భూములు పంచుతామని ఆయన పేర్కొన్నారు.

**రాజకీయ వేడి మరింత పెరిగేనా?** సిద్దిపేట భూముల వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య పరస్పర ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో బండి సంజయ్ తాజా వ్యాఖ్యలు రాజకీయంగా మరింత వేడి పెంచాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు సిద్దిపేటలో భూములపై పరిశీలనకు వెళ్లినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

## జన్వాడ ఫామ్‌హౌస్ నాది.. కేటీఆర్‌కు సంబంధం లేదు:

అది తన వ్యక్తిగత ఆస్తి అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నేతలు ఫామ్‌హౌస్‌ను సందర్శించాలని యోచిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, “జన్వాడలోని ఫామ్‌హౌస్ భూమి నాది. కేటీఆర్, నేను చిన్ననాటి స్నేహితులం. ఆ ఫామ్‌హౌస్‌ను కేటీఆర్‌కు లీజుకు ఇచ్చాను. అంతకుమించి దీనితో ఆయనకు ఎటువంటి సంబంధం లేదు“ అని తెలిపారు. ఆ భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేవని, అన్ని పత్రాలు చట్టబద్ధంగా, సక్రమంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వానికి గానీ, సంబంధిత అధికారులకు గానీ ఏవైనా అనుమానాలు ఉంటే, తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్ రెడ్డి సూచించారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే, ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నేతలు వచ్చి తనిఖీలు చేయడం, దీనిని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టప్రకారం జరిగే ఎటువంటి విచారణకైనా తాను పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ‘ప్రజాస్వామ్యం’ కన్నీరు తుడిచిన హైకోర్టు!..

పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలో ఓటర్ల తీర్పుకు ఉన్న ప్రాధాన్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణపై ఈ తీర్పు మరోసారి దృష్టిని కేంద్రీకరించింది. పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం మరో పార్టీలోకి వెళ్లే ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానాల జోక్యం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ఫిరాయింపుల రాజకీయానికి హెచ్చరిక సంకేతం** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం కాకపోయినా.. వాటిపై చర్యల విషయంలో చాలాకాలంగా చర్చ కొనసాగుతోంది. అధికార సమీకరణాల్లో భాగంగా ఎమ్మెల్యేలను ఆకర్షించడం, ప్రతిపక్ష బలాన్ని తగ్గించడం వంటి రాజకీయ వ్యూహాలు గతంలోనూ కనిపించాయి. అయితే ప్రజల ఓట్లతో గెలిచిన ప్రతినిధులు పార్టీ మారినప్పుడు రాజీనామా చేసి తిరిగి ప్రజా తీర్పు కోరాలనే డిమాండ్ కూడా తరచూ వినిపించింది.తాజా పరిణామాలు పార్టీ ఫిరాయింపులపై రాజకీయ పార్టీల్లోనూ, ప్రజల్లోనూ కొత్త చర్చకు కారణమయ్యాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో భవిష్యత్‌లో తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది.

**రెండు పార్టీల మధ్య ఇరుక్కున్న నేతలు** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కొందరు ఎమ్మెల్యేల రాజకీయ పరిస్థితిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. పార్టీ మారిన తర్వాత ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం, అభివృద్ధి పనులు, రాజకీయ గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి కొందరు నేతల్లో వ్యక్తమవుతోందని కథనం పేర్కొంటోంది. పార్టీ మారే సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, నియోజకవర్గాల్లో ఎదురవుతున్న సమస్యలు, స్థానిక రాజకీయ ఒత్తిళ్లు నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫలితంగా కొందరు నేతలు తిరిగి పాత రాజకీయ వేదిక వైపు చూస్తున్నారనే చర్చ కూడా సాగుతోంది.

**అధికార పార్టీలోనూ అసంతృప్తి స్వరాలు** కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు పార్టీలో సమన్వయం, పదవులు, ప్రాధాన్యత వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలు అసంతృప్తికి కారణమవుతున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై బహిరంగంగా స్పందించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

రాజకీయాల్లో పార్టీ మార్పు అనేది కేవలం అధికార సమీకరణాలకు మాత్రమే పరిమితం కాకుండా.. వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందనే అంశం తాజా పరిణామాలతో మరోసారి తెరపైకి వచ్చింది. **భవిష్యత్ అడుగులపై ఉత్కంఠ** హైకోర్టు తీర్పు తర్వాత ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తి నెలకొంది. న్యాయపరమైన పరిణామాలు, నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయం, ఆయా పార్టీల వైఖరి ఆధారంగా వారి రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుందనేది కీలకంగా మారింది. పార్టీ మార్పులు తాత్కాలిక రాజకీయ లాభాలను అందించినా.. దీర్ఘకాలంలో ప్రజల విశ్వాసం, రాజకీయ స్థిరత్వం, స్థానిక బలంపై ప్రభావం చూపుతాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

# ఆరు నూరైనా.. వెనక్కి తగ్గం!..

భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే రెవెన్యూ రికార్డులు, డాక్యుమెంట్లు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రికార్డుల్లో ఎంత భూమి ఉంది? డాక్యుమెంట్లలో ఎంత చూపించారు? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అనే అంశాలను సర్వే ద్వారా నిర్ధారిస్తామని తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రి పొంగులేటి పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను చేస్తున్న ఆరోపణలకు పూర్తి ఆధారాలు, అధికారిక రికార్డులు ఉన్నాయని చెప్పారు.

విచారణ పూర్తయిన తర్వాత అన్ని విషయాలు స్పష్టమవుతాయని తెలిపారు. భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని చట్ట ప్రకారం పరిశీలించాల్సిందేనని స్పష్టం చేశారు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో సమగ్ర సర్వే** కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై వచ్చిన ఫిర్యాదులు, స్థానికుల నుంచి అందిన సమాచారాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు కూడా అందిన సమాచార ఆధారంగానే ఉన్నాయని చెప్పారు. ఫామ్‌హౌస్ పరిసరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నట్లు సర్వేలో తేలితే, వాటిని చట్ట ప్రకారం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో వ్యవసాయ భూములు లేవని పేర్కొన్న తర్వాత భారీగా భూములు ఎలా వచ్చాయన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సి ఉందని మంత్రి అన్నారు. ఎన్నికల అఫిడవిట్లు, ప్రస్తుతం ఉన్న భూముల వివరాల మధ్య వ్యత్యాసాలపై రికార్డుల ఆధారంగా విచారణ జరుగుతుందని తెలిపారు. కేటీఆర్ కుమారుడి పేరుతో ఉన్న 40 ఎకరాల భూమి అంశంపైనా మంత్రి స్పందించారు. చిన్న వయసులోనే అంత పెద్ద మొత్తంలో భూమి ఎలా వచ్చిందన్న విషయంపై రికార్డుల ఆధారంగా పరిశీలన జరగాల్సి ఉందన్నారు.

**హరీశ్‌రావు అఫిడవిట్‌పై కూడా పరిశీలన**

హరీశ్‌రావు ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన భూములు, ప్రస్తుతం ఉన్న భూములు, భౌతిక స్వాధీనం, ట్రస్టుల పేరుతో ఉన్న ఆస్తుల వివరాలను కూడా పరిశీలిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. అఫిడవిట్‌లో ఎంత చూపించారు? రికార్డుల్లో ఎంత ఉంది? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఎంత ఉంది? బినామీ పేర్లతో ఏమైనా ఉన్నాయా? అనే అంశాలు అధికారిక పత్రాల ద్వారా తేలాల్సి ఉందన్నారు.

భూముల లావాదేవీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాలు, ఇతర చట్టబద్ధమైన ఆధారాలను పరిశీలిస్తామని చెప్పారు. ఏదైనా పత్రాల్లో లోపాలు ఉన్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రాంతంలోని భూ వ్యవహారాలపై కూడా దృష్టి సారిస్తామని, అక్రమాలు బయటపడితే అక్కడ ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

**అసైన్డ్ భూముల రైతులకు భరోసా**

అసైన్డ్ భూముల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ పట్టాలు ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టబోమన్నారు. పట్టాలు కలిగిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలిపారు. ముందుగా అసైన్డ్ భూముల పూర్తి వివరాలను సేకరించి, ఆ తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**రంగనాయకసాగర్ భూములపై రికార్డుల పరిశీలన**

రంగనాయకసాగర్ పరిసర ప్రాంతాల్లోని భూముల వ్యవహారంపై కూడా సమగ్ర విచారణ జరుపుతామని మంత్రి తెలిపారు.

ఇరిగేషన్ శాఖ రికార్డులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలిస్తామని చెప్పారు. భూముల వర్గీకరణలో మార్పులు, రిజిస్ట్రేషన్ల విధానం, రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వ నిధుల వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తామని తెలిపారు.

**వట్టినాగులపల్లి భూములపై వివరణ**

వట్టినాగులపల్లి భూములతో తనకు ప్రత్యక్ష యాజమాన్య సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో ఉన్నానని, తన ప్రాజెక్టులకు గత ప్రభుత్వాల సమయంలోనే అనుమతులు వచ్చాయని తెలిపారు. కుటుంబ సభ్యులను రాజకీయ వివాదాల్లోకి లాగకుండా, భూముల రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగానే చర్చ జరగాలని మంత్రి అన్నారు. “నేను తప్పు చేసినా చట్ట ప్రకారం శిక్ష పడాల్సిందే. ముఖ్యమంత్రి గారు,

నేను ఆధారాలు లేకుండా మాట్లాడటం లేదు. ప్రతి అంశానికి డాక్యుమెంట్లు ఉన్నాయి. సర్వే, రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాత వాస్తవాలు బయటకు వస్తాయి” అని తెలిపారు. అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మంత్రి స్పష్టం .

## భక్తులు, జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టండి.

కమిషనర్ ఎం. జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక** నగరంలో భక్తులు, జనాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, తీర్థకట్ట వీధి, గరుడసేవకు వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తీర్థకట్ట వీధి, గాంధీ రోడ్డు లలో దుకాణల ముందు చెత్త ఎక్కువగా ఉండడం పట్ల సిబ్బందిని మందలించి, వెంటనే శుభ్రం చేయించాలని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భక్తులు, ప్రజలు ఎక్కువగా ఉంటారని అక్కడ పారిశుద్యం మెరుగ్గా చేపట్టాలని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాల్లో భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం జూపార్క్ మార్గంలో ఉన్న కళ్యాణి వాటర్ ఫిల్టర్ హౌస్ ను పరిశీలించారు. కళ్యాణి డ్యామ్ నుండి వచ్చే నీటిని శుభ్రపరిచే విధానాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, తదితరులు ఉన్నారు.



## వ్యవస్థాపక నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 18 . (నంది పత్రిక )::** పాఠశాల విద్యార్థుల్లో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, సృజనాత్మక ఆలోచన మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాలలి ఆధ్వర్యంలో పీఎం శ్రీ మోడల్స్కూల్ మరియు నంద్యాలలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల దిస్ కార్యక్రమం లో భాగంగా "వ్యవస్థాపక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్.ఆర్.ఈ.సి. బృందం పాఠశాల ను సందర్శించి విద్యార్థులతో పరస్పర చర్చలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆవిష్కరణ, వ్యవస్థాపకత, డిజైన్ థింకింగ్, ఆలోచనల సృష్టి, నమూనా అభివృద్ధి, ఇంక్యుబేషన్, హ్యాకథాన్లు, మేధో సంపత్తి, స్టార్టప్ అభివృద్ధి మరియు ఆధారిత సమస్య పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యను గుర్తించడం నుంచి ఆలోచన, రూపకల్పన, నమూనా, పరీక్ష, ధ్రువీకరణ, ప్రదర్శన మరియు ఉత్పత్తి అభివృద్ధి వరకు జరిగే "ఆలోచన నుండి ఉత్పత్తి వరకు"ప్రయాణాన్ని విద్యార్థులకు వివరించారు. ఎస్.ఆర్.ఈ.సి.లో అభివృద్ధి చేసిన వినూత్న విద్యార్థి ప్రాజెక్టులు మరియు ఏఐ ఆధారిత ప్రాజెక్టును ప్రదర్శించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పీఎం శ్రీ ఏపీమోడల్ స్కూల్, పాణ్యం ప్రిన్సిపాల్ దినేష్ మరియు జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, నంద్యాల ప్రిన్సిపాల్ చిత్ర కార్యక్రమానికి సహకరించి, విద్యార్థులను చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించారు. విద్యార్థులు బృందంతో ఉత్సాహంగా సంభాషిస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, విద్య, పర్యావరణం, వ్యవసాయం, ఆరోగ్యం, రవాణా మరియు దైనందిన జీవితానికి సంబంధించిన సమస్యలకు వినూత్న పరిష్కారాలను ఆలోచించేందుకు ప్రోత్సాహం పొందారు. శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం మద్దతు, ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. డీన్ రీసెర్చ్ & డెవలప్మెంట్ డాక్టర్ జి. సౌమ్య ఈ ఆవిష్కరణ ఆధారిత కార్యక్రమానికి నాయకత్వం వహించి మార్గదర్శకత్వం అందించారు. కళాశాల ఇన్నోవేషన్ కౌన్సిల్ కు అనుబంధమైన అధ్యాపక బృందం మరియు ఎస్.ఆర్.ఈ.సి. బృంద సభ్యులు చురుకుగా పాల్గొని, విద్యార్థుల్లో ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక దృక్పథాన్ని పెంపొందించేందుకు తమ సహకారం అందించారు.




## ప్రపంచ వెదురు దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారు.



కడప నగరంలోని మేదర వీధిలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెదురుతో జీవనోపాధి పొందుతున్న మేదరి చేతివృత్తుల వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పురాతన కళారూపమైన వెదురు ఉత్పత్తుల సంస్కృతిని కాపాడుతూ, సమాజానికి విలువైన సేవలు అందిస్తున్న మేదర సోదర సోదరీమణుల కృషిని వారు మనస్ఫూర్తిగా అభినందించారు. మేదరుల ఐక్యత వర్ధిల్లాలని, వారి ఆర్థిక అభ్యున్నతికి అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, మేదర కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్కు అభినందనలు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 18** ఖాజీపేట: ఖాజీపేట మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ-2)గా బాధ్యతలు స్వీకరించిన రామిశెట్టి చంద్రశేఖర్కు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు, బృంద సభ్యులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, సరస్వతి, జానకీరామ్, వీరనారాయణ, బాల ఓబుల్ రెడ్డి, రాజేష్, ప్రసాద్, శ్రీనివాసులు, సుమన్, రాజన్న, ప్రేమ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు వినతిపత్రం అంద జేసిన రైతులు రైతు సంఘం నాయకులు.




**బేతంచెర్ల సెప్టెంబర్ 18 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం లోని అన్ని గ్రామాలలో రైతులు ఖరీఫ్ సీజన్ లో కంది,కొర్ర,సజ్జ, మొక్కజొన్న, ఆముదము,పత్తి,సొయా బీన్ తదితర పంటలను జూన్ జులై నెలల్లో కురిసిన అర కొరగా పడ్డ వర్షాలతో,విత్తనాలు వేసి పంటలను సాగుచేశారు. ఎలినినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో ఆగస్టు,సెప్టెంబర్ నెలల్లో వర్షాలు రాక, వేసిన పంటలు మూరెడు -జానెడు పెరిగాయి. ఎండి పోయాయి. ఎండా కాలంను తలపించే విధంగా, ఎండలు ఉండుటవల్ల,పంటలన్నియూ వాడి పోయాయి. ఎండిపోయాయి.బేతంచెర్ల మండలములోని రైతులు తమ భూములలో ఎరువులు విత్తనాలు కొని సాగు చేస్తే,కళ్లెదుటే పంటలు ఎండి పోవడం చూసి దిగులు చెందుతున్నారు.సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలని,దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.అందు కొరకై బేతంచెర్ల మండలమును కరువు మండలంగా ప్రకటించాలని,కరువు సహాయక చర్యలు చేపట్టాలని శుక్రవారం,బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణికి,రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి శుక్రవారం బేతంచెర్ల తహసీల్దార్ కు వినతి పత్రం అంద జేశారు.రైతులను కాపాదాలన్నారు. ప్రభుత్వానికి,ఉన్నతా ధికారులకు,తెలియ జేస్తూ ఈ కరువు పై నివేదిక ఇవ్వాలని, రైతులను ఆదు కోవాలని కోరారు..ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారులకు తెలియ జెస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎపి.రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు,మండల కార్యదర్శి పి.రామ మోహన్,అధ్యక్షులు సి.మద్దిలేటీ స్వామి, బి.సంజీవ నాయుడు,ఆలకుంట్ల మధు,నాగేశ్వర రావు రైతులు పాల్గొన్నారు.

## జలాదీవాసం వీడుతున్న సంగమేశ్వరాలయం

### -గాయత్రీ దేవి వరుణ పూజలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** శ్రీశైలం జలాశయంలో రోజురోజుకు నీటీ నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో శుక్రవారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగుల నుంచి 861 అడుగులకు చేరుకుంది. దీంతో జాలాధీవాసంలో ఉన్న ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణాజలాలనుంచి బయల్పడుతుంది. ఆలయ గోపుర భాగం 5 అడుగుల మేర బయటపడింది. దీంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది. గాయత్రీ దేవి వరుణ పూజలు సంగమేశ్వరంలోని ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో 5 వ రోజు గాయత్రీ దేవి వరుణ జపములు వంటి ప్రత్యేక పూజలు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ నిర్వహించారు. వర్షాలు మెండుగా కురువాలని వినయక చవితిని పురష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



## కడప నగరంలో ఘనంగా గణపతి నవరాత్రులు..



పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకున్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి గారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుని మండపాలను టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి గారు దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని అరవింద్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఓల్డ్ షోరూం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని, రామాలయం సమీపంలో కొలువైన గణనాథుడిని, వై జంక్షన్ వద్ద ఆర్.వి.ఎస్.ఆర్ నగర్ గణేష్ కమిటీ మండపాన్ని, చీ+రా కాలనీ గణేష్ కమిటీ మండపాన్ని, కో-ఆపరేటివ్ కాలనీ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన స్వామివారిని, రాజా రెడ్డి స్ట్రీట్లోని రాజా రెడ్డి గణేష్ కమిటీ వినాయకుడిని, అక్కయపల్లి హనుమాన్ టెంపుల్ సమీపంలో విఘ్న వినాయక భక్తి కమిటీ మండపాన్ని, అలాగే ఎర్రముక్కపల్లి బాలవికాస్ స్కూల్ వద్ద శ్రీ వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను వారు దర్శించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో మండపాల నిర్వాహకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే వినాయకుని చల్లని ఆశీస్సులతో కడప ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, కడప నగరం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా దేవేంద్రప్ప.. ఎస్జీఎఫ్ సెక్రటరీగా సుధాకర్



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 18** డోన్ పట్టణంలోని పాతపేట గ్లానూ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దేవేంద్రప్ప రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, పాఠశాల పి .ఈ .టీ . సుధాకర్ నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ూ+ఖీ) సెక్రటరీగా ఎంపికైన సందర్భంగా వారికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పాతపేట గ్లానూ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డిను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దేవేంద్రప్ప, సుధాకర్లను సుబ్బారెడ్డి అభినందించి, వారి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన దేవేంద్రప్పకు, క్రీడా రంగంలో సేవలందిస్తూ నంద్యాల జిల్లా ూ+ఖీ సెక్రటరీగా ఎంపికైన సుధాకర్కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాతపేట గ్లానూ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టుల ధర్నా

**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 18** నంద్యాల ఐ న్యూస్ విలేకరులు, పత్తికొండ విశాలాంధ్ర విలేకరిపై పోలీసుల వైఖరిని నిరసిస్తూ డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వద్ద శుక్రవారం జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, వార్తా సేకరణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న విలేకరుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హక్కులను, వృత్తి స్వేచ్ఛను కాపాడేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జర్నలిస్టులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను వివరిస్తూ ఆర్డీఓకు ప్రతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై సమగ్రంగా పరిశీలించి, జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



# చనుగొండ్లలో ఆర్మీ జవాన్ కుటుంబంపై దాడి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 18:** నంద్యాల జిల్లా డోన్ మండలం చనుగొండ్ల గ్రామంలో ఆర్మీ జవాన్ చెన్నకేశవులు కుటుంబంపై జరిగిన దాడి ఘటనపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు తీవ్రంగా స్పందించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.కెవిపిఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ, డోన్ మండల కార్యదర్శి రాజకుమార్, రాష్ట్ర నాయకులు ఎన్.జి. కృష్ణ తదితరులు చనుగొండ్ల గ్రామాన్ని సందర్శించి దాడికి గురైన రాశిపోగుల నాగన్నను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. న్యాయం జరిగే వరకు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రంగమ్మ మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సుమారు 13 సంవత్సరాలుగా భారత సైన్యంలో సేవలందిస్తున్న ఆర్మీ జవాన్ చెన్నకేశులు కుటుంబానికే స్వగ్రామంలో రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. సైనికులు దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందిస్తున్నారని, అలాంటి సైనికుడి కుటుంబంపై కులం పేరుతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కెవిపిఎస్ డోన్ మండల కార్యదర్శి రాజకుమార్ మాట్లాడుతూ.. డోన్ మండలంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, కుల వివక్షపై పోలీసులు మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. దళితులు తమకు ప్రాణహాని ఉందని పోలీసులను ఆశ్రయించినప్పుడు ముందస్తు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాధితులకు భద్రత కల్పించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించకూడదని కోరారు.కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.జి. కృష్ణ మాట్లాడుతూ.. చనుగొండ్ల గ్రామంలో దళితుల పట్ల కులవివక్ష, అంటరానితనం కొనసాగుతున్నాయని ఆరోపించారు. గ్రామంలో ఆలయ ప్రవేశం, నీటి వనరుల వినియోగం, రెండు గ్లాసుల పద్ధతి వంటి వివక్షకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని తెలిపారు. కులవివక్ష నిర్మూలనకు రెవెన్యూ, పోలీసు, సాంఘిక సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా నిర్వహిస్తున్న సామాజిక శంఖారావం కార్యక్రమంలో



గ్రామాల్లో కులవివక్షకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు.బోయలను బీసీ కేటగిరీలోనే కొనసాగించాలని, ఎస్టీ జాబితాలో చేర్చకూడదని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల భవిష్యత్తులో దళితులపై దాడులు పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ జవాన్ చెన్నకేశులు కుటుంబంపై దాడి ఘటనపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠినంగా స్పందించాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని, న్యాయం జరగకపోతే దళితులను పెద్ద ఎత్తున సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు

# రెండు చోట్ల నిమజ్జనానికి ఏర్పాట్లు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర గణేషుల నిమజ్జనానికి రెండు చోట్ల ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తమకు అనుకూలమైన చోట నిమజ్జనం చేసుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఆయన వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని హంద్రీ నది వద్ద ఏర్పాటు చేస్తున్న ఘాట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుంకేసుల జలాశయం అడుగంటడంతో నిమజ్జనానికి నీటి కొరత ఏర్పడిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే భక్తుల మనోభావాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని,సాధ్యాసాధ్యాలను పరిశీలించి, కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద అశోక్ నగర్ పంప్ హౌస్‌లో శుద్ధి ప్రక్రియలో భాగంగా వెలువడే వాష్ వాటర్‌ను కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు తరలించి, 600 మీటర్ల మేర నీటిని నిల్వ చేసుకునేలా అడ్డుకట్టలు నిర్మించినట్లు తెలిపారు. నీటి ప్రవాహం లేని దృష్ట్యా ప్రత్యామ్నాయంగా నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీ నదిలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వారి వారి అభీష్టం మేరకు ఎక్కడైనా నిమజ్జనం చేసుకోవచ్చని, రెండు చోట్ల నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ నరేష్, శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ కాలనీలో డ్రైనేజీ పూడిక తీయాలి

## ఒరిగిన కరెంటు స్తంభాలను వేరే చోటన పాతాలి. సి.పియం

**కర్నూల్ సిటీ నంది పత్రిక** శాంతినగర్ కాలనీ నుండి బీసీ కాలనీ కి వెళ్లే దారిలో డ్రైనేజీ వ్యవస్థ చాలా అస్తవస్థంగా ఉన్నది గతంలో పంట పొలాల కొరకు ఉన్నటువంటి జిడిపి కాలువ నీళ్లు రాకపోవడం వల్ల ఈరోజు గ్రామానికి డ్రైనేజీగా ఉపయోగపడుతున్నది అది కాస్త పూడికతో ప్లాస్టిక్ వ్యర్థాలతో మునిగిపోయింది కర్నూల్ రోడ్డు నుండి వెల్దుర్తి రోడ్డు మాల వీధి శాంతినగర్ కాలనీ మీదుగా వచ్చే మురుగునీరని ఈ కాల్వ ద్వారా వెళుతూ ఉంటాయి అది కాస్త పూర్తిగా చెడిపోయింది ఆ కాలువలోనే కరెంటు పోల్లు కూడా ఉన్నాయి అవి కూడా లెవెన్ కె.వి హై పవర్ లైన్ ఉన్నది డ్రైనేజీ పక్కన ఎస్ ఎస్ 46 నెంబర్ గల ట్రాన్స్ఫారం కూడా ఉన్నది నిత్యము ఆ దారి వెంట పిల్లలు ముసలి వాళ్లు వాహనాలు బీసీ కాలనీకి అలాగే ముడుమలకు గ్రామానికి వెళుతూ ఉంటాయి . ఆదమరచి చెయ్యి కాస్త ఎలా అని చాపితే ట్రాన్స్ఫారం తగులుతుంది కనీసం ట్రాన్స్ఫారం చుట్టూ రక్షణ కూడా లేదు ఏ క్షణానైనా స్తంభాలు ఒరిగి విద్యుత్ సరఫరా సమయంలో గిన కింద పడితే ఎంతో ప్రాణ నష్టం జరుగుతుంది అలాగే ఆ కాలువ విస్తీర్ణం 60 అడుగులు అటు ఇటు ఇల్లు కట్టుకుంటూ వచ్చి ఆ దారి కాస్త ఇరుకుగా మారింది డ్రైనేజీ కూడా మట్టితో పూర్తిగా దెబ్బతిన్నది శాంతినగర్ కాలనీ నుండి బీసీ కాలనీ వరకు సిసి డ్రైనేజీ వేస్తే మురుగునీరు పోవడానికి ఎంతో అవకాశం ఉంటుంది అలాగే బీసీ కాలనికి పోయే దారిలో రాత్రిపూట వెళ్లాలంటే చీకటిమయంగా ఉంది ఒక్క వీధిలైటు కూడా ఆ రోడ్డు వెంబడి లేదు కావున అధికారుల స్పందించి సీసీ రోడ్డు డ్రైనేజీ వేయాలని గ్రామస్తులతో కలిసి పరిశీలించడం జరిగింది గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి చిన్న వీధిలైట్ల సమస్య పరిష్కరించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు వెంటనే వీధిలైట్లు వేసి డ్రైనేజీ పూడికను తొలగించాలని వారు డిమాండ్ చేశారు



అలాగే విద్యుత్ అధికారులు మండల ఏఈ పరిశీలించి ట్రాన్స్ఫారానికి రక్షణ గోడ కట్టి ఒరిగిన స్తంభాలను మరోచోట వేసి ప్రజలకు రక్షణ కల్పించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కే రాజు గఫూర్ మియా జీపీ వీరన్న గంగాధర్ నక్క గిడ్డయ్య పరమేష్ గిరి రాఘవేంద్ర సోమేశు శ్రీనివాసులు నాగరాజు తదితర కాలనీ ప్రజలందరూ కూడా పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రాలకు సాధ్యం

## - ఐసిడిఎస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మ




**కొత్తపల్లి - నంది పత్రిక :** పిల్లలకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించడం అంగన్వాడి కేంద్రాలకు సాధ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని జి వీరాపురం గ్రామంలో జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమం అంగన్వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు అందిస్తున్న ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. పిల్లలకు అన్నం పెట్టేముందు నిర్వాహకులు చేతులు శుభ్రంగా కడుక్కొని పిల్లల చేతులను కూడా శుభ్రంగా కడిగి ఆహారం ఇవ్వాలి అన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మహిళలతోపాటు చిన్నారులు కూడా ఆరోగ్యంగా ఉంటారు అన్నారు. తాజాగా వేడిగా వండిన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాలి అన్నారు. వంటలు చేస్తున్న సమయంలో వంటగది శుభ్రం చేసుకుని తాజా కూరగాయలతో పాటు కూరగాయలు కడిగి వంటలు చేయాలి అన్నారు. అలాగే మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మహిళలు పాల్గొన్నారు.

# ఆదోనిలో గణేష్ నిమజ్జనోత్సవం.

**భద్రతా ఏర్పాట్లను , నిమజ్జన శోభాయాత్రను కాలినడకన పర్యటించి పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**చిన్న హరివానం వద్ద ఎల్లెల్సీ కెనాల్ వద్ద నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన ... జిల్లా ఎస్పీ.**

**ఆదోని టూ టౌన్ పోలీసు స్టేషన్ లో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ పరిశీలన.**

**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఆదోని పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు.ముందుగా ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. కంట్రోల్ రూమ్ నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ బందోబస్తు పరిస్థితిని సమీక్షించారు.అనంతరం నిమజ్జన శోభాయాత్ర మార్గంలో జిల్లా ఎస్పీ కాలినడకన పర్యటించి, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను స్వయంగా పరిశీలించారు.ఆదోని సమీపంలోని చిన్న హరివానం వద్ద గల ఎల్లెల్సీ కాలువ వద్ద వినాయక నిమజ్జన ఘాట్‌ను అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఘాట్ వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.



గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శోభాయాత్ర మార్గాల్లో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణను పక్కాగా అమలు చేయాలని సూచించారు.ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో డిఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు మధుసుధన్ రావు, కేశవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, ఇస్పి ఎస్సై మహేష్ కుమార్ మరియు స్పెషల్ పార్టీలు , ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక మండపం వద్ద నుంచి వెళ్లిన కొద్దిసేపటికే యువకుడి మృతి



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 18** డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గణేష్ గౌడ్ అనే యువకుడు వినాయక మండపం వద్ద నుంచి వెళ్లిన కొద్దిసేపటికే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు సమాచారం. వినాయకుని మండపం వద్ద ఉన్న సమయంలో సాధారణంగానే ఉన్న గణేష్ గౌడ్, అక్కడి నుంచి వెళ్లిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో ఇందిరానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల పంపిణీ

**మర్రిపాడు సెప్టెంబర్ 18నంది పత్రిక :** చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు కీ.శే.శ్రీనివాసులు జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ముక్కు ప్రమీల ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.పదవ తరగతిలో పాఠశాల ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించిన విక్రాంత్,సునీత,నరేష్ లకు వరుసగా రూ.7,000,రూ.5,000,రూ.3,000 చొప్పున,అలాగే 8, 9 తరగతుల్లో ప్రథమ స్థానాలు సాధించిన లక్ష్మీదేవి,అంజలి లకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున మొత్తం రూ.20,000 రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమనీ,దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు మరింత కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రులు,దాతల ప్రోత్సాహం కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వి.రమణయ్య, మల్లికార్జున స్వామి,పెంచలరావు,తిరుపాలు, రహీమ,రాఘవేంద్ర,ప్రసాద్, రాజేంద్రకుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ మద్దులేటీ స్వామి క్షేత్రంలో ఘనంగా తిరుచ్చి వేడుకలు.

**బేతంచెర్ల సెప్టెంబర్ 18 ( నంది పత్రిక ).** శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఘనంగా స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమంను డిప్యూటీ కమీషనర్ మరియుశ్రీ మద్దులేటీ నరసింహ స్వామి కార్యనిర్వాహణ అధికారి ఎం. రామాంజనేయులు అధర్వంలో జరిగింది.శ్రీ స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమంలో దేవస్థానం పురోహితులు, ఆలయ సిబ్బంది, భక్తులు తిరుచ్చి వేడుకలలో భాగ స్వాములయ్యారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

## -విద్యాప్రమాణాలు పెంచేలా బోధన

**కొత్తపల్లి - నంది పత్రిక :** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య విద్యార్థులకు అందించ బడుతుందని మండల విద్యాధికారి నాగరాజు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామం ఎస్సీకాలనీలో ఎంపీపీఎస్ స్పెషల్ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. ఓకటి, రెండవ తరగతుల విద్యార్థులను ఫ్లాష్ కార్డుల ద్వారా అక్షరాలు నేర్పించుటను, నేర్చుకున్న అక్షరాలను గుర్తించుటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందన్నారు, అదేవిధంగా విద్యా ప్రమాణాలను పెంచేవిధంగా ఉపాధ్యాయుల బోధన ఉంటుందన్నారు. విద్యార్థులలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్న ఉపాధ్యాయురాలు నాగజ్యోతిని అభినందించారు.



# వైభవంగా ముగిసిన కలెక్టరేట్ లో పరిపాలన గణపతి ఉత్సవాలు

**నంద్యాల జిల్లా ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం పరిపాలన గణపతికి ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్**

**ఉత్సాహంగా డమ్ము కొట్టి పరిపాలన వినాయక నిమజ్జన కార్యక్రమశీను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**ప్రజలకు, అధికారులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**

**జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని పరిపాలన గణపతినీ ప్రార్థించాను : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 18(నంది పత్రిక):- జిల్లా పరిపాలనా భవనం (కలెక్టరేట్) ఆవరణలో గత ఐదు రోజులుగా నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా ముగిశాయి. ఐదవ రోజు పాటు కలెక్టరేట్ ఆవరణలో ప్రతిష్టించిన పరిపాలన గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక తో కలసి జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు, అధికారులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో నంద్యాల జిల్లా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల సంక్షేమం, జిల్లాలో సుపరిపాలన మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రభుత్వ పాలనా విభాగాలు సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పరిపాలన వినాయకుడినీ ప్రార్థించినట్లు తెలిపారు. జిల్లాలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందాలని, పరిశ్రమల రంగం పురోగమించాలని, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రాచీన ఆలయాలు, చారిత్రక మరియు పర్యాటక ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో జిల్లాకు తరలివచ్చి ఆయా ప్రాంతాలను సందర్శించేలా పర్యాటక రంగం అభివృద్ధి చెందాలని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రతిష్టించిన పరిపాలన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం, నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు ఘాట్ వద్ద నిర్వహించే వినాయక



విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి శోభాయాత్రగా తరలించనున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, విద్యుత్, అగ్నిమాపక తదితర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సమైక్యంగా, భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిమజ్జన మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, కలెక్టరేట్ ఏవో సుబాకర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు కు కూటమి ప్రభుత్వం బలమైన భరోసానిస్తుంది కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూల్ సిటీ నంది పత్రిక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యువత భవిష్యత్తుకు బలమైన భరోసానిస్తోందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.కర్నూలు నగరంలోని బీ క్యాంపులో గల సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన యువత భవితకు భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, ప్రభుత్వం నిరుద్యోగ యువతకు కలిపిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు.. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కలిపించక వారి భవిష్యత్తు ను గాలికి వదిలేసిందని మండిపడ్డారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీ.ఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగుల కలలను సాకారం చేస్తూ వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు...అంతే కాకుండా తాజాగా జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేస్తుందన్నారు..ఇక రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్న ఎంపీ,విద్యార్థులు, యువత మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.. అనంతరం కళాశాలలోని పలు సమస్యలను ప్రిన్సిపల్ నాగరాజా శెట్టి ఎంపీ దృష్టి కి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కళాశాల అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తానని ఎంపీ తెలిపారు..ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజా శెట్టి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలపై పన్నుల భారం మోపుతున్న కూటమి ప్రభుత్వం

## చట్ట సవరణ 44/2020, జీవో 198 రద్దు చేయాలి..సిపిఎం




నంది పత్రిక ఆత్మకూరు రాష్ట్రంలోని టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఘోరమైన నమ్మకద్రోహానికి పాల్పడిందని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,ఏ సురేంద్ర, ఎన్ వీరన్నలు లు తీవ్రస్థాయిలో విమర్శించారు. సిపిఎం కార్యాలయంలో శుక్ర వారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆకాశమంత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు, ఇప్పుడు పట్టణ ప్రజల నడ్డి విరుస్తూ పన్నుల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల వేళ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరుస్తూ, ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

**అప్పుడు వ్యతిరేకించి.. ఇప్పుడు ఆమోదిస్తారా?**

రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని దాదాపు 1.50 కోట్ల మంది పట్టణ ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజాకంటక ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని చట్ట సవరణ 44/2020, జీవో 198 లను నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ, నేడు అధికారంలోకి రాగానే అదే పన్నుల పెంపును యథాతథంగా కొనసాగించడం అజ్ఞానముఆరోపించారు. గత మూడేళ్లలో రూ.1,000 కోట్ల ఇంటి పన్నుల భారం వేయగా, ఈ ఏడాది ఏప్రిల్ నుండి మరో 400 కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. గత ఆరేళ్ల కాలంలో రాష్ట్రంలో ఇంటి పన్నులు ఏకంగా 131 శాతం పెరగడం పాలకుల దోపిడీకి నిదర్శనమని గణాంకాలతో సహా ఎండగట్టారు. దొడ్డిదారిన 'యూజర్ ఛార్జీల' బాదుడు..

పైకి చెత్త పన్నును రద్దు చేశామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం, లోపాయికారీగా జీవో 673 ద్వారా 'యూజర్ ఛార్జీల' పేరుతో దొడ్డిదారిన మళ్లీ చెత్త పన్ను వసూలు చేసేందుకు కుట్ర పన్నిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలు ముగియగానే ఈ వసూళ్లను అధికారికంగా ప్రజలపై రుద్దడానికి రంగం సిద్ధం చేశారని హెచ్చరించారు.

**పాలకులారా జవాబు చెప్పండి, సిపిఎం డిమాండ్లు..**

ఇంటి పన్నులు విచ్చలవిడిగా పెంచేందుకు కారణమైన జీవో 198, చట్ట సవరణ 44/2020 ని తక్షణమే రద్దు చేయాలన్నారు.

యూజర్ ఛార్జీలు, చెత్త పన్ను పునరుద్ధరణ కోసం తెచ్చిన జీవో 673 తో పాటు 196, 197 జీవోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే పట్టణ ప్రజలకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను నెరవేర్చి, ఆ తర్వాతే కూటమి నాయకులు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజలను పన్నుల పేరుతో పీల్చి పిప్పి చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఏకం చేసి, సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని నేతలు స్పష్టం చేశారు.

## ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా.--

**కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో.**

**బేతంచెర్ల గవర్నమెంట్ హాస్పిటల్ నందు మెడికల్ క్యాంప్ ఏర్పాటు.**



బేతంచెర్ల సెప్టెంబర్ 18 ( నందిపత్రిక ). భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినమును పురస్కరించుకొని, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు సేవా సంకల్ప అభియాన్ అనే పేరుతో, సేవా కార్యక్రమాలు నిర్వహించ వలసిందిగా భారత ప్రభుత్వం పిలుపునిచ్చింది.అందులో భాగంగా సెప్టెంబర్ 18 శుక్రవారం,శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం (గవర్నమెంట్ హాస్పటల్) నందు సూపరిండెంట్ సాగరిక అధ్యక్షతన ఈ యొక్క మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నంద్యాల జిల్లా భాజపా ఇన్చార్జి పిడి. పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రతి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించ వలసిందిగా పిలుపునిచ్చారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం, ప్రజల ఆరోగ్య రీత్యా ఎన్నో పథకాలు తీసుకొస్తుందని దయచేసి దేశ ప్రజలందరూ వాటిని ఉపయోగించు కోవాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకట రమణ, జిల్లా కార్యదర్శి నాగమోహన్ రెడ్డి, పట్టణ మరియు టౌన్ అధ్యక్షులు మోహన్ రావు రమేష్ బాబు, భాజాప నాయకులు కార్యకర్తలు, వైద్య సిబ్బంది సుమారు 200 మంది పైగా ఈ యొక్క మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు.



# కలసపాడు కుమ్మరి వీధిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



కలసపాడు, సెప్టెంబర్ 18 :(నంది పత్రిక ):

కలసపాడు గ్రామం, కుమ్మరి వీధిలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.కుమ్మరి వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తూ గణనాథుడిని కొలుస్తున్నారు. కుమ్మరి సంఘం సభ్యులు, వీధి ప్రజలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేస్తున్నారు.వినాయకుడి మండపాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలు మరియు వివిధ అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు.ఐదు రోజుల పాటు ప్రతిరోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు.మధ్యాహ్నం మరియు రాత్రి భోజనాలను భక్తులకు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కుమ్మరి వీధికి చెందిన కుటుంబాలు ఒక్కొక్క రోజు చొప్పున భోజన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు.దీంతో ఐదు రోజుల పాటు భక్తులందరికీ ఆత్మీయంగా భోజన వసతి కల్పిస్తున్నారు.

**వేడుకల్లో భాగంగా భజన కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.** భజనలతో కుమ్మరి వీధి మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. సాంప్రదాయ కళలను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా కోలాట కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.మహిళలు, యువతీ యువకులు కలిసి కోలాటం ఆడి వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు.కోలాట కార్యక్రమంలో చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా వివిధ ఆటలు, వినోద కార్యక్రమాలను నిర్వహించారు.చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఆటల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.మహిళల కోసం కూడా ప్రత్యేక ఆటలు, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటలను ఉత్సాహంగా ఆస్వాదించారు.పిల్లలు, మహిళలు, యువత, పెద్దలు అందరూ కలిసి వేడుకల్లో పాల్గొనడంతో కుమ్మరి వీధిలో పండుగ వాతావరణం నెలకొంది.కుటుంబ సభ్యులంతా కలిసి భక్తి కార్యక్రమాల్లో పాల్గొంటూ గణనాథుడి ఆశీస్సులు పొందుతున్నారు."గణపతి బప్పా మోరియా" నినాదాలతో కుమ్మరి వీధి మార్మోగింది. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. కులమతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో కలిసి ఈ వేడుకలను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కుమ్మరి సంఘం సభ్యుల సమష్టి కృషి, వీధి ప్రజల సహకారంతో వేడుకలు ఎంతో ఘనంగా కొనసాగుతున్నాయి.ఐదు రోజుల పాటు భక్తి, భజనలు, కోలాటాలు, ఆటలు, అన్నదాన కార్యక్రమాలతో కుమ్మరి వీధి సందడిగా మారింది.చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా ఈ వేడుకల్లో పాల్గొంటు న్నారు.సాంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు అందరూ కలిసి ఆనందాన్ని పంచుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ వేడుకలు కుమ్మరి వీధి ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, ఆత్మీయతను మరింత పెంచుతున్నాయి.ప్రతి ఒక్కరి సహకారంతో ఐదు రోజుల వినాయక చవితి వేడుకలు ఎంతో సంతోషకరంగా కొనసాగుతున్నాయి.గణనాథుడి కృపతో కలసపాడు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థించారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వినాయక చవితి వేడుకలు కలసపాడు గ్రామంలోని కుమ్మరి వీధికి భక్తి, ఐక్యత, ఆనందానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

## అయోడిన్ పై అవగాహన పెంచుకోవాలి

**ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ జి సుధాకర్**



కర్నూల్ సిటీ నంది పత్రిక భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోధీ 76 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని , ప్రజా జీవితంలో అయన 25 ఏళ్ళ సేవా ప్రస్తావాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా రోజా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయోడిన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ జి సుధాకర్ మాట్లాడుతూ థైరాయిడ్ మెడ ముందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఏర్పడుతుందని, దీనికి తగిన మోతాదులో అయోడిన్ అందించకపోతే గాయిటర్ లేదా గొంతువాపు వ్యాధి వస్తుందని, అయోడిన్ లోపం థైరాయిడ్ సమస్యకు ప్రధాన కారణమని తెలిపారు. థైరాయిడ్ సమస్య వలన బరువు పెరగడము లేదా తగ్గడము, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడము, ఉద్వేగం, చర్మం పోడిబారడము వంటి లక్షణాలు కనబడుతాయని తెలిపారు. అయోడిన్ ఉప్పును వేడికి , ఎండకు దూరంగా ఉంచాలని, ఉప్పు తాయారు చేసిన తేది నుండి ఆరు నెలలలోపు వాడకపోతే అందులో ఉన్న అయోడిన్ ఆవిరి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమములో వైద్యులు డాక్టర్ అఫ్రీన్, వైద్య సిబ్బంది, ప్రోజేక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



గంగ బడికి చేరిన గణనాథులు

మహానంది సెప్టెంబర్ 18 (నంది పత్రిక):- మహానంది మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత 5 రోజులుగా భక్తులచే విశేష పూజలందుకున్న గణనాథులకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు అత్యంత కోలాహలంగా సాగింది. భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం తెలుగంగ ప్రధాన కాలువలో గణనాథులను నిమజ్జనం చేశారు.

నిమజ్జన మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.



## భద్రాద్రిలో కరెన్సీ నోట్లతో గణపయ్య..

## అలంకరణకు రూ.1.45 కోట్లు!

తెలంగాణవ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో కొలువైన గణపతి విగ్రహం విశేష అలంకరణతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. బాపూజీ నగర్‌లోని గణనాథుడిని ఏకంగా రూ. 1.45 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు.

# భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద దాడి అంటే అది రాజ్యాంగం పైననే దాడి

## హెచ్ వరప్రసాద్ పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలి

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద దాడి అంటే అది భారతదేశం పై చేస్తున్న దాడి అని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు మహాత్మ జ్యోతిబా పూలే సావిత్రిబాయిపూలే ల ఆలోచన విధానాలను ఆశయాలను అవమానించే చర్యలను దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ ఆధ్వర్యంలో బి.సి నాయకులు శేషఫణి అధ్యక్షతన నిరసన ధర్నా కార్యక్రమాన్ని పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, సీనియర్ అడ్వకేట్ వై. జయరాజ్, డాక్టర్ వి.వి.సుబ్రమణ్యం, రాజు ఎరుకల, భరత్ కుమార్ ఆచారి, కరుణాకర్, క్రాంతి కుమార్, రామశేషయ్య , మైనార్టీ నాయకులు ఎక్బాల్ భాష, సలీమ్,గుండాల నాయక్ న్యాయవాదులు నర్సింహులు,బాలాజి రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన దాడి అంటే రాజ్యాంగం పైననే దాడి అని వారు అన్నారు. మహనీయులపై దాడి అంటే వారి ఆశయాలను కించపరిచే చర్య అని, అంతేకాకుండా రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళల హక్కులపై దాడి అని ఆమె అన్నారు. మొన్న తెల్లాపూర్ లో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం పై దాడి చేసి ఇప్పుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద దాడి చేస్తూ, మరోపక్క చదువుల తల్లి సావిత్రిబాయిపూలేని అవమానిస్తూ, వ్యంగంగా పోస్టులు పెడుతూవుంటే పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైనది కాదని ఆమె అన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద దాడి అంటే భారతదేశం పై దాడిగా పరిగణించి వారిపై దేశద్రోహం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక సంఘం సంస్కర్తలు, మహనీయుల చరిత్రను కల్పితంగా మార్చే ప్రయత్నాన్ని మతోన్మాదులు చేస్తూ ఉంటే బహుజనులు చూస్తూ ఊరుకోరని ఆమె హెచ్చరించారు.శుక్రవారం వరప్రసాద్ మాట్లాడుతూ ఉన్నా , అతను స్వేచ్ఛగా పుస్తకాన్ని రాసుకుంటూ ఉన్నాడు అన్న అది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛనే అని అతను గుర్తు పెట్టుకోవాలని

ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షురాలు వగ్గ ఈరమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కటికె భాను, ఆదోని డివిజన్ అధ్యక్షురాలు ఎలీశమ్మ , ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు హుస్సేన్ బీ, ఆకుతోట పద్మావతి, పాలెం రాధ, మండల అధ్యక్షులు అమీనాబీ, ఖాసీం బీ, కన్యాకుమారి, కమ్మర లక్ష్మీ , కార్యవర్గ సభ్యులు సింధూజ, రంగమ్మ , సుశీల,వీణ,నంద్యాల లక్ష్మి , చిరంజీవమ్మ ,కళావతి, మాసుం బీ, రేవతి, ఖాజాబీ, బోయ భాగ్యమ్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రెండు చోట్ల నిమజ్జనానికి ఏర్పాట్లు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర గణేషుల నిమజ్జనానికి రెండు చోట్ల ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తమకు అనుకూలమైన చోట నిమజ్జనం చేసుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఆయన వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని హంద్రీ నది వద్ద ఏర్పాటు చేస్తున్న ఘాట్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుంకేసుల జలాశయం అడుగంటడంతో నిమజ్జనానికి నీటి కొరత ఏర్పడిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే భక్తుల మనోభావాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని,సాధ్యాసాధ్యాలను పరిశీలించి, కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద అశోక్ నగర్ పంప్ హౌస్‌లో శుద్ధి ప్రక్రియలో భాగంగా వెలువడే వాష్ వాటర్‌ను కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు తరలించి, 600 మీటర్ల మేర నీటిని నిల్వ చేసుకునేలా అడ్డుకట్టలు నిర్మించినట్లు తెలిపారు. నీటి ప్రవాహం లేని దృష్ట్యా ప్రత్యామ్నాయంగా నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీ నదిలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వారి వారి అభీష్టం మేరకు ఎక్కడైనా నిమజ్జనం చేసుకోవచ్చని, రెండు చోట్ల నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ నరేష్, శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

# శిల్ప నేచర్ హోమ్స్ లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 18 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పా నేచర్ హోమ్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహ నిమజ్జనోత్సవం కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గత 4రోజులుగా ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా జరిగిన కార్యక్రమాలు అన్నివయసుల వారిని ఆకట్టుకున్నాయి. రక్షికా రెడ్డి,దేశిక, సాత్విక చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అందరిమన్నలను చూరగొంది. ఈ కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, టెంట్ హౌస్ కుమార్, ఫర్టిలైజర్ లక్ష్మి రెడ్డి ,స్టేట్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్, లాయర్ మల్లికార్జున రెడ్డి, శ్రీనివాస రెడ్డి, మాధురి, ప్రసన్న, సుధ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమకేసుల పై సిట్ ఏర్పాటు చేయాలి

## - కలెక్టర్ ఏ సిరికి జర్నలిస్టు సంఘాల వినతి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఐ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, నంద్యాల ఐ న్యూస్ రిపోర్టర్స్ సురేష్, నాగచంద్రుడులపై పోలీసులు పెట్టిన కేసులపై ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని జర్నలిస్టు సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం జర్నలిస్టు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఏ సిరి కి వినతిపత్రం అందజేశారు. మంత్రి తనయులు చేస్తున్న అక్రమాలు, దందాల పై కథనం ఇస్తే జీర్ణించుకోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకొని జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించారని కలెక్టర్ కు వివరించారు. ఈ అక్రమ కేసుల పై విచారణ కు ప్రత్యేక విచారణ సంస్థ(సిట్) ఏర్పాటు చేసి నిష్పక్ష విచారణ చేపట్టాలని కోరారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కలెక్టర్ కు వినతిపత్రం అందచేసిన వారిలో జెఎసి చైర్మన్ సత్యన్న, ఏపీయుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్ రాజు, ఏపిఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి మద్దులేటి, ఏపీజెఎఫ్ జిల్లా ప్రసిడెంట్ రామక్రిష్ణ, ఏపిడబ్ల్యూజెఎఫ్ సిటీ ప్రసిడెంట్ శివశంకర్, ఏపియూడబ్ల్యూజె నాయకులు, రాజ్ టివి స్టాఫ్ రిపోర్టర్ భాష్యం మధుసూధన్ గౌడులు ఉన్నారు.

# గణేష్ నిమజ్జనానికి రెండు చోట్ల ఏర్పాట్లు

## కేసీ కెనాల్, హంద్రీనీవాలో ఏర్పాట్లు

## ప్రజలు ఎక్కడైనా నిమజ్జనం చేసుకోవచ్చు

## పెద్ద విగ్రహాలకు హంద్రీనీవాలో అనుకూలం

## ఇటీవల 350 విగ్రహాల నిమజ్జనం

## రెండు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి టీజీ భరత్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించేందుకు కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్‌తో పాటు నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీనీవాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. శుక్రవారం నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీనీవా, వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లో నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యుల విజ్ఞప్తి మేరకు వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లోనే గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సుంకేసుల బ్యారేజ్‌లో నీటి లభ్యత లేకపోవడంతో కేసీ కెనాల్‌కు నీరు వచ్చే అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌కు రెండు వైపులా గోడలు నిర్మించి ట్యాంక్ తరహాలో నీటిని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. పంప్‌హౌస్ నుంచి ప్రతిరోజూ వెలువడే సుమారు 20 లక్షల లీటర్ల వాష్ వాటర్‌ను వినాయక ఘాట్ వద్ద నిల్వ చేసి, భక్తులు సంప్రదాయబద్ధంగా గణేష్ నిమజ్జనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీనీవాలో నీటి ప్రవాహం అనుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే హంద్రీనీవాలో 350కి పైగా విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు వెల్లడించారని పేర్కొన్నారు. భక్తులు తమకు అనుకూలమైన ప్రాంతంలో గణేష్ నిమజ్జనం చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇరిగేషన్, కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.గాయత్రి గోసేవ సమితి ప్రతినిధులు భక్తులకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# రెండు చోట్ల నిమజ్జనానికి ఏర్పాట్లు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర గణేషుల నిమజ్జనానికి రెండు చోట్ల ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తమకు అనుకూలమైన చోట నిమజ్జనం చేసుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఆయన వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని హంద్రీ నది వద్ద ఏర్పాటు చేస్తున్న ఘాట్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుంకేసుల జలాశయం అడుగంటడంతో నిమజ్జనానికి నీటి కొరత ఏర్పడిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే భక్తుల మనోభావాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని,సాధ్యాసాధ్యాలను పరిశీలించి, కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద అశోక్ నగర్ పంప్ హౌస్‌లో శుద్ధి ప్రక్రియలో భాగంగా వెలువడే వాష్ వాటర్‌ను కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు తరలించి, 600 మీటర్ల మేర నీటిని నిల్వ చేసుకునేలా అడ్డుకట్టలు నిర్మించినట్లు తెలిపారు. నీటి ప్రవాహం లేని దృష్ట్యా ప్రత్యామ్నాయంగా నన్నూరు టోల్‌గేట్ వద్ద హంద్రీ నదిలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వారి వారి అభీష్టం మేరకు ఎక్కడైనా నిమజ్జనం చేసుకోవచ్చని, రెండు చోట్ల నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ నరేష్, శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన వి.ఆర్.ఎ లకు వి.ఆర్.ఓలు గా పదోన్నతి కల్పించాలి.



**బేతంచెర్ల సెప్టెంబర్ 18 ( నంది పత్రిక ).** అర్హత కలిగిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ( విఆర్ఎ ) లను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని వీఆర్ఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో బేతంచెర్ల మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో,వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమంలో భాగంగా టెంట్ వేసుకుని నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బ రాయుడు,రైతు సంఘం బేతంచెర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు చల్లా మద్దిలేటి రామ్మోహన్ మరియు రైతు సంఘం సభ్యులు శుక్రవారం వీఆర్ఏల నిరాహార దీక్షలశిబిరం దగ్గరకు వెళ్లి విఆర్ఎ లకు సంఘీభావం తెలిపి, వారు మాట్లాడుతూ,చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ,రాత్రి పగలు తేడా లేకుండా, రెవెన్యూ డిపార్ట్మెంట్ కు మరియు ప్రజలకు అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించక పోవడం రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. వీఆర్ఏలు పదవి విరమణ పొందిన తర్వాత వారికి ప్రభుత్వాన్ని ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకపోవడం సరైంది కాదని అన్నారు. వన్ టైం సెటిల్మెంట్ కింద వీఆర్వోలుగా పదోన్నతి కల్పించి, వాచ్ మెన్ మరియు అటెండర్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను,వీఆర్ఏలకు వర్తింప చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించి గ్రామ సహాయకుల సంఘం, ( వీఆర్ఏ ) వారి సమస్యలను పరిష్కరించరించని యెడల అన్ని ప్రజా సంఘాలను, కార్మిక సంఘాలను కలుపుకొని, ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు . ఈ కార్యక్రమంలో విఆర్ఏలు మహేశ్వరమ్మ,నాగలక్ష్మి, రామయ్య,లక్ష్మీ మోహన్, ఎల్లమ్మ,శివమ్మ,మద్దిలేటి,అలీం భాష, మరియు రైతు సంఘం శివ గంగన్న, లింగమూర్తి తాతయ్య,అనిల్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో హోరాహోరిగా వినాయక లడ్డూల వేలం:

## పోటాపోటీగా పాల్గొన్న భక్తులు



**మహానంది సెప్టెంబర్ 18 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా లడ్డూ ప్రసాదం వేలం పాటలు అత్యంత ఉత్సాహంగా, హోరాహోరిగా సాగాయి. గ్రామంలోని పలు వినాయక మండపాల వద్ద భక్తులు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడానికి పోటాపోటీగా వేలం పాడారు.ఈ వేలం పాటల్లో అత్యధికంగా బాల గణేష్ యూత్ వినాయక మండపం వద్ద లడ్డూ ప్రసాదం రూ. 46,800 పలికింది. అలాగే పీర్ల చవిడి వద్ద దూదేకుల మౌలిస్, తెలుగు చంద్రశేఖర్ రూ.45,000 కు లడ్డూను కైవసం చేసుకున్నారు.గ్రామంలో జరిగిన లడ్డూ వేలం పాటల అంకాలమ్మ గుడి వద్ద కూరాకుల చంద్ర శేఖర్ రూ. 40,116,పాత బ్యాంకు బజారు : పులిబండ్ల దుబ్బ చంద్ర రూ. 31,000,,తెలుగు పేట: తెలుగు వెంకట లచ్చుమ్మ రూ. 28,000,,పెద్దమ్మతల్లి బాల గణేష్ కమిటీ: పులిమద్ది వాసు దేవుడు రూ. 27,100,,అమ్మవారి శాల: పోలిశెట్టి శివ రూ.22,500,,పెద్దమ్మ అరుగు: వడి శ్రీనివాసులు రూ. 22,000,,,కొత్తపేట (గౌండ దస్తగిరి ఇల్లు): టమటం కేశవయ్య రూ. 20,800,,,టీచర్ మద్దిలేటి ఇంటి వద్ద మండ్ల మధు : రూ. 23,500 మరియు పలుచోట్ల స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు దక్కించుకున్నారు. లడ్డు ప్రసాదం దక్కించుకుంటే కుటుంబానికి అంతా మంచే జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది.



# స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సమష్టి కార్యాచరణతో సిద్ధం

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

## సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిని సస్పెండ్ చేయాలి మహిళా కాంగ్రెస్ డిమాండ్

## కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సమష్టి కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ బి క్రాంతి నాయుడు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం శనివారం కర్నూలులోని కళా వెంకట్రావు భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, బ్లాక్ మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి కార్యక్రమాల నిర్వహణ, పార్టీ సంస్థాగత బలోపేతం,నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామం, వార్డు మరియు బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహిస్తూ, ప్రజలతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోవాలని, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరంతరం కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు, సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమం మరియు ప్రజా సమస్యలపై పార్టీ వైఖరిని గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ సంస్థాగత బలాన్ని మరింత విస్తరించుకోవడంతో పాటు ప్రజలతో అనుబంధాన్ని బలోపేతం చేసుకునే కీలక సందర్భమని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తన పరిధిలో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక సమస్యలను ప్రజల తరఫున ముందుకు తీసుకువచ్చి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఎన్నికల వరకు మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ, క్రమబద్ధమైన కార్యాచరణ, సమష్టి కృషి మరియు పరస్పర సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న మాట్లాడుతూ జిల్లాస్థాయి సమావేశాలకు కొందరు బాధ్యతగల పదవులు ఉండి హాజరు కాకపోవడం పార్టీని విస్మరించడమేనని అధిష్టానం నియమించిన జిల్లా అధ్యక్షుల నాయకత్వంలో పనిచేయాలని, పార్టీ కోసం పనిచేయలేని వారు వెళ్ళిపోవచ్చు అని ఆ స్థానాలలో అధిష్టానం సమర్థులైన వారిని నియమించు కుంటుందని, స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పనిచేయకుంటే పార్టీ బలహీనపడుతుందని తెలియజేశారు. అనంతరం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాధ్యతగల సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ని కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జిల్లా మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందని అధిష్టానం జిలాని భాష ని పార్టీ నుండి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న మాట్లాడుతూ ఎవరైనా అధిష్టానానికి కట్టుబడి పని చేయాలని పార్టీని వచ్చే ఎన్నికల్లో ఎక్కువ మంది అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో పలువురు నాయకులు తమ తమ ప్రాంతాల్లోని రాజకీయ, సామాజిక పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత స్థితిగతులు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి స్థాయిలో పార్టీ నాయకత్వం క్రియాశీలకంగా పనిచేసేలా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు మరియు వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని, అనుబంధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు. సమావేశం ద్వారా నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం మరింత బలోపేతమై, స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టి కార్యాచరణతో ముందుకు సాగేందుకు అవసరమైన దిశానిర్దేశం లభించిందని జిల్లా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్, సేవాదళ్ జిల్లా చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి యూత్ కాంగ్రెస్ సిటీ అధ్యక్షులు డాక్టర్ అలీఖాన్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శులు షేక్ రియాజుద్దీన్, మాజీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆనందరాజు, చిన్న స్వామి, పూల రామాంజనేయులు కాంగ్రెస్ నాయకులు జాన్ సదానందం, రాజేంద్రప్రసాద్, విజయభాస్కర్, శివానంద్, షేక్ మాలిక్, యువరాజు, దేశ్పాండే రిజ్వాన్ మహిళా కాంగ్రెస్ కే లక్ష్మీదేవి, శిరీష అంజనమ్మ చిట్టెమ్మ మొదలగువారు జడ్పిటిసి మండల కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థులు సర్పంచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.



# వెల్దుర్తి మండలంలోని అక్రమంగా మైనింగ్ మాఫియా సిపిఐ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** స్థానిక రామళ్లకోట గ్రామ పరిధిలోని అక్రమంగా త్రవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలలో పరిశీలించిన సిపిఐ బృందం ఈ సందర్భంగా సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి కృష్ణ. సిపిఐ సీనియర్ నాయకులు డి. రాజు పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు మాట్లాడుతూ వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామ పరిధిలోని అక్రమ మైనింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సీపీఐ మండల నాయకులు టి.కృష్ణ, చిన్న మాధవులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నాయా? లేవా? అన్న విషయాన్ని సంబంధిత మైనింగ్ శాఖ అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు అయితే మైనింగ్ ఆఫీసర్ విజిలెన్స్ ఆఫీసర్ ఫోన్ చేస్తే కూడా ఎత్తకుండా గా సమాధానం ఇవ్వడం లేదు దీని వెనకాల పెద్ద కుట్ర జరుగుతుందని మైనింగ్ మాఫియా జరుగుతుందని అనుమానం ఉంది ఒకవేళ మైనింగ్ నడిపియాలని పర్మిషన్ వస్తే ప్రభుత్వ మాత్రమే నడిపించాలని కూలీల వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు అధికారుల మౌనం వెనుక రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయా? లేక మరేదైనా కారణం ఉందా? అని సీపీఐ మండల నాయకుడు టి.కృష్ణ ప్రశ్నించారు. ప్రజల ముందే జరుగుతున్న తవ్వకాలపై అధికారులు స్పందించకపోతే ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయని అన్నారు.మైనింగ్‌కు సంబంధించి అనుమతులు, నిబంధనలు, పర్యావరణ అనుమతులు తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా మైనింగ్ శాఖ అధికారులు స్పందించి రామళ్లకోటలో జరుగుతున్న తవ్వకాలపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు డి రాజు.బాలరాజు. తదితరులు పాల్గొన్నారు



# ఇక సెలవు

## ఘనంగా ఆదోనిలో వినాయకుని నిమజ్జనం

## పోలీసులు కట్టదిట్టమైన భద్రత వలయంలో ఆదోని



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలో వినాయకుని నిమజ్జనం అంగరంగ వైభవంగా కొనసాగింది పట్టణంలో మండపాలలో ఐదు రోజులు పూజలు అందుకొని ఈరోజు నిమజ్జనం జరగడం అయింది అలాగే పట్టణంలో ఎక్కడైనా చూసినా వినాయకుని పాటలు డీజేలో డ్యాన్సులు తో ఊరేగింపు కొనసాగింది ఉదయం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వెలిసిన వినాయకుని వేలం పాటలో వినాయకుని లడ్డు వేలం వేయగా బసాపురం గ్రామం చెందిన టిడిపి నాయకుడు రామస్వామి 365,000 కు దక్కించుకున్నాడు అలాగే వినాయకుని ఉండి వేలంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తనయుడు మనోజ్ రెడ్డి లక్ష 16 వేలకు వేలం దక్కించుకున్నారు ఆదోనిలో మొదటిసారిగా విశ్వహిందూ పరిషత్ పరిషత్ లో వెలిసిన వినాయకుడు మొదటిసారిగా మదిరి కాలువ నిమజ్జనం చేసిన తర్వాతే పట్టణంలో అన్ని వినాయకులు నిమజ్జనం చేస్తారు పట్టణంలో స్వచ్ఛందంగా కొంతమంది వాటర్ ప్యాకెట్లు భోజనాలు ప్రజలకు ఉచితంగా అందజేశారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి వెంకటరమణ ఆధ్వర్యంలో దాదాపు 800 మంది పోలీసు బలగాలతో బందోబస్ ఏర్పాటు చేశారు



# ప్రభాత్ కళాశాలలో యువతకు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ శబరి





**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 18 :** యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ శబరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్లపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న ప్రభాత్ కళాశాలలో యువత భవిష్యత్తుకు భరోసా అన్న కార్యక్రమానికి ఎంపీ శబరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శబరికి ప్రభాత్ కళాశాల చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ సి బ్బంది ఏ కోడూరు తెలుగుదేశం నాయకుడు వద్దు మధుసూదన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ డాక్టర్ శబరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యువకులకు వాలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి వారిని మోసం చేశారని విమర్శించారు. యువకులు ఉద్యోగం పొందడమే లక్ష్యంగా పెట్టుకోకుండా నైపుణ్యాలను పెంపొందించుకొని స్వ యం ఉపాధి అవకాశాలను పోటీ పడాలని అన్నారు. ఉపాధి అవకాశాలలో తాము ఎదగడంతో పాటు మరో కొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి యువత ఎదగాలని ఆకాంక్షించారు. ఇతర దేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడకుండా సొంత దేశాలలోనే అవకాశాలను సృష్టించుకుని అభివృద్ధిలో యువకులు భాగస్వాములు కావాలని ఎంపీ డాక్టర్ శబరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్థిరమైన పరిపాలన కొనసాగితే యువకుల భవిష్యత్తుకు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం యువతకు అన్ని విధాలుగా సహకారం ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదగడంతోపాటు నాయకత్వ బాధ్యతలు చేపట్టే స్థాయికి యువత చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# ఇద్దరు బ్యాటరీ దొంగలు అరెస్ట్

## నాలుగో పట్టణ సీఐ విక్రమ సింహ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు 4 వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కు చెందిన 1. చెంచు వెంకట రాముడు వయస్సు: 24 సంవత్సరాలు, గా/శీ చెంచు వెంకట స్వామి, =/శీ శ్రీనివాస నగర్, వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర, కల్లూరు ఎస్టేట్, కర్నూలు టౌన్. మరియు 2. చెంచు సుంకప్ప వయస్సు: 22 సంవత్సరాలు, గా/శీ చెంచు సుంకప్ప =/శీ శ్రీనివాస నగర్, వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర, కల్లూరు ఎస్టేట్, కర్నూలు టౌన్ అనే ఇద్దరు వ్యక్తులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఎలాగైనా డబ్బు సంపాదించి వాళ్ళ అవసరాలు తీర్చుకోవచ్చని ఉద్దేశ్యంతో టీవీఎస్ షో రూమ్ ఎదురుగ వున్న రంగ బాటరీస్ & ఇంవేర్టర్స్ షాప్ లో డిస్ప్లే కొరకు పెట్టిన ట్రాక్టర్ బ్యాటరీలు 4, జేసీబీ కి చెందిన కొత్త బ్యాటరీలు 2 ఆటో కి చెందిన రెండు పాత బ్యాటరీలు మరియు ట్రాక్టర్ కు చెందిన రెండు కొత్త బ్యాటరీలను దొంగతనం చేసి వాటిని అమ్ముకోవాడానికి కోడుమూరు రోడ్డు లో వున్న కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వద్ద పెట్టుకొని వుండగా రాబడిన సమాచారం మేరకు కర్నూలు ×ఎ టౌన్ సీఐ ఆదేశాల మేరకు యస్ ఐ పి.శ్రీనివాసులు తన సిబ్బంది కలిసి ఇద్దరి ముద్దాయిలను పట్టుకొని అరెస్ట్ చేసి వారు దొంగలించిన 10 బ్యాటరీలను స్వాదినం చేసుకోవడమైనది. వీటి విలువ సుమారు రూ 1,20,000/- వరకు ఉంటుంది.



# నగర ప్రజలకు ప్రతిరోజు త్రాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

## కమిషనర్ ఎం.జయకృష్ణ.

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక**

తిరుపతి నగర ప్రజలకు ప్రతిరోజు తగినన్ని తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ తెలిపారు. నగరానికి నీరు అందించే కైలాసగిరి రిజర్వాయర్ ను, మంగళం వద్ద గల వాటర్ ఫిల్టర్ హౌస్ ను శుక్రవారం మధ్యాహ్నం ఇంజినీరింగ్ అధికారిలతో కలసి కమిషనర్ పరిశీలించారు. కైలాసగిరి రిజర్వాయర్లో నీటి సామర్థ్యం, నీరు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. అలాగే ఎండి పుత్తూరు మీదుగా మంగళం ఫిల్టర్ హౌస్ కు, అక్కడ నుండి నగర ఆయా వార్డులకు త్రాగునీరు ఎలా పంపిణీ చేసే విషయాలను అధికారులు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు ప్రతిరోజు సమృద్ధిగా త్రాగునీరు అందేలా తగు చర్యలు ప్రణాళికలు రూపొంది స్తున్నామన్నారు. అందులో భాగంగా కైలాసగిరి రిజర్వాయర్లో నీటి సామర్థ్యం పంపింగ్ విధానం పరిశీలించామని అన్నారు. నగరంలో మొత్తం నీటి సర పరా వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నగరంలో త్రాగునీటి పైప్ లైన్ లీకేజీ లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా త్రాగునీటిని వృధా చేయకుండా తగినంత వినియోగించు కోవాలని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, డి.ఈ. మహేష్ తదితరులు ఉన్నారు.



# మైదుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టి**

**ప్రజలకు చేరువయ్యేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలను అమలు చేయాలి : ఎమ్మెల్యే**



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక:** మైదుకూరు మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పురోగతిపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మైదుకూరు మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరాలను కలెక్టర్కు అందించారు. తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, పట్టణ ప్రణాళిక, గృహ నిర్మాణ అనుమతులు, పట్టణ పేదల అభివృద్ధి, వివిధ అభివృద్ధి పథకాల కింద చేపడుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. మైదుకూరు పట్టణంలో ప్రస్తుతం భూగర్భ జలాల ఆధారంగా తాగునీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత తాగునీటి వనరుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పైపుల ఏర్పాటు, నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి కేంద్రం తదితర పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మున్సిపాలిటీలో రోజువారీ తాగునీటి అవసరం, ప్రస్తుతం అందుతున్న నీటి పరిమాణం, ఉన్న లోటుపై అధికారులు వివరించారు. ప్రస్తుతం బోరు బావుల ద్వారా 3.65 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతుండగా, అవసరానికి తగ్గ నీటి లభ్యత కోసం ప్రత్యామ్నాయ, శాశ్వత వనరులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.రహదారుల అభివృద్ధి, గుంతల పూడ్చివేత, మురుగు కాలువల నిర్మాణం, వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా కాలువల్లో పూడిక తొలగింపు పనులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మైదుకూరు మున్సిపాలిటీలో వివిధ నిధులతో కొనసాగుతున్న రహదారులు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయడం, చెత్త తరలింపు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, ప్రజలకు అందుతున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, సిబ్బంది సేవలపై ప్రజాభిప్రాయాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిదిద్దాలని సూచించారు. విద్య, వైద్య ఆరోగ్య శాఖల్లో సేవలను పటిష్టం చేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఖాళీలను పూరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని... సంబందిత అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర పథకాల కింద చేపడుతున్న పనులను కూడా కలెక్టర్ సమీక్షించారు. నీటి సరఫరా మెరుగుదలతో పాటు చెత్త నిర్వహణ, వ్యర్థాల శుద్ధి, పాత చెత్త తొలగింపు, భూమి పునరుద్ధరణ వంటి పనులు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణ అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల మధ్య అవసరమైన అనుమతులు, భూ సంబంధిత అంశాలు, ఇతర శాఖల సమన్వయంతో పరిష్కరించాల్సిన సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై సమన్వయంతో చర్యలు చేపట్టి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ... మైదుకూరు మున్సిపాలిటీ తోపాటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా అమలు చేయాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేందుకు ప్రజాప్రతినిధుల తరఫున సహకారం అందిస్తామని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని శాఖలవారీగా సమీక్షించి, పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, తహసీల్దార్ రాజ సింహా నరేంద్ర, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ పనులను వేగవంతంగా పూర్తి చేయండి

**పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా పూర్తి చేయాలి**

**నిధుల సద్వినియోగంతో అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం**



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 18(నంది పత్రిక):-** ఎంపీ ల్యాడ్స్ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, మంజూరైన ప్రతిపాదనలు, పనుల ప్రస్తుత స్థితిగతులు, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన పనుల అమలులో అనవసర జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. పెండింగ్ పనుల వివరాల కోసం ప్రజాప్రతినిధులు, ప్రజలు వారాల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. పనులు చేపట్టడంలో స్థానిక సమస్యలు, ఇతర కారణాలతో జాప్యం జరుగుతున్నట్లయితే వాటిని అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు లేదా సంబంధిత ఏజెన్సీలు పనులు చేపట్టడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే కారణాలను స్పష్టంగా గుర్తించి, అవసరమైన నోటీసులు జారీ చేయాలని సూచించారు. నిర్ణీత వ్యవధిలో పనులు ప్రారంభించని లేదా పూర్తి చేయని పనులను నిబంధనల మేరకు రద్దు చేసి, ప్రజలకు అత్యవసరంగా అవసరమైన ఇతర అభివృద్ధి పనులకు నిధులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**పెండింగ్ వంతెనల పనులపై ప్రత్యేక దృష్టి** ముచ్చుమర్రి ప్రాంతంలో మధ్యలో నిలిచిపోయిన వంతెన పనులపై సమీక్షిస్తూ, బిల్లుల చెల్లింపులు తదితర సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు. నంద్యాల పట్టణంలోని బీసీ హాస్టల్ భవనాలకు అవసరమైన కొత్త అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన గార్బేజ్ కలెక్షన్ వాహనాలు, ట్రాక్టర్లు తదితర వాహనాల కొనుగోలుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని తెలిపారు.

**ఎంపీ ల్యాడ్స్ కింద రూ.14.70 కోట్లతో 197 అభివృద్ధి పనులు – కలెక్టర్ రాజకుమారి..** ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి సంవత్సరానికి రూ.490 లక్షల చొప్పున మొత్తం రూ.14.70 కోట్లు నిధులు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ జి రాజ కుమారి వివరించారు. ఇప్పటివరకు 197 పనులను సిఫార్సు చేయగా, 196 పనులకు మంజూరు లభించిందన్నారు. మిగిలిన ఒక పనికి ఆర్డబ్ల్యూఎస్ శాఖ నుంచి ఫీజిబిలిటీ నివేదిక అందిన అనంతరం మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మంజూరైన పనుల్లో 20 పనులు ఎస్సీ ప్రాంతాల్లో, 6 పనులు ఎస్టీ ప్రాంతాల్లో, 170 పనులు ఇతర ప్రాంతాల్లో చేపట్టినట్లు వివరించారు. మంజూరైన 196 పనుల్లో ఇప్పటివరకు 113 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పనుల అమలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 48, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా 58, పంచాయతీరాజ్ పీఐయూ ద్వారా 59, నంద్యాల మున్సిపాలిటీ ద్వారా 2, కోవెలకుంట్ల మున్సిపల్ కమిషనర్ పరిధిలో 6 పనులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఎంపీ ల్యాడ్స్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు పెండింగ్ పనుల కారణాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తయి, సంతృప్తికర ధ్రువీకరణ పత్రం అందిన అనంతరమే నిధుల చెల్లింపులు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సిపిఓ ప్రకాష్ పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**కర్నూల్ సిటీ నంది పత్రిక**

కోడుమూరు నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులకు రూ. 15,11,267/- అక్షరాల పదైదు లక్షల పదకొండు వేల రెండు వందల అరభై ఏడు రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పంపిణీ చేశారుఅనంతరం

చెక్కులను తీసుకున్న లబ్ధిదారులు సీఎం నారా చంద్రబాబు నాయుడు కి డి.విష్ణువర్ధన్ రెడ్డికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కి ధన్యవాదాలు తెలిపారు.

లబ్ధిదారుల పేర్లు మరియు సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలు

1.పేరపోగు మణి (బి తాండ్రపాడు )-21,762/-

2.ఉమ్మని నాగేంద్ర రావ్ (మామిదాలపాడు -31,843/-

3.కందుకూరు ప్రతాప్ రెడ్డి (స్టాంటానుపురం ) -1,18,881/-

4.కె కృష్ణవేనమ్మ (నిర్జురు ) -65,000/-

5 వడ్డె చంటి (బురాన్ దొడ్డి ) -2,02,900/-

6.సజీవరాజు (స్టాంటానుపురం ) -46,171/-

7.గుడిసె సాగరిక (చనుగొండ్ల )-18,900/-

8.ఇస్మాయిల్ భాష (గూడూరు టౌన్ )-30,786/-

9. కుమ్మరి సిద్దయ్య ఆచారి (వర్కుర్ )-30,000/-

10.చాకలి లక్ష్మీదేవి (గూడూరు టౌన్ )-70,000

11.కురువ బజారి (సుంకేసుల )-46,455

12.సందుల బోయ చంద్రనాయుడు (ముడుములగుర్తి )-76,911/-


13.మల్లెపోగు శ్రీనివాసులు (గుడిపాడు )-56,258/-

14.సంధ్యపోగు వంశీ (పోలకల్ )-36,300/-

15.దొడ్డి హరి కుమార్ రెడ్డి (బసవపురం )-61,334/-

16.కాల్వ వరదరాజులు (దిన్నె దేవరపాడు )-1,66,484/-

17.తెలుగు రంగన్న (గొందిపర్ల )-25,166/-



18.సంధ్య రాముడు (యనగండ్ల )-35,500/-

19.నాగలక్ష్మి ( ఈ తాండ్రపాడు )- 37,153/-

20.సోమిరెడ్డి విజయ మోహన్ రెడ్డి (అమడగుంట్ల )-45,000/-

21.చంద్రా రెడ్డి (కొంతతలపాడు )-88,463/-

22.నూర్జహన్ (నాగలాపురం )-2,00,000/-

## ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 18 నంది పత్రిక :** శుక్రవారం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల వారి గణేష్ లడ్డు రూ.1.01 లక్షలకు కైవసం



**డోన్,నంది పత్రిక సెప్టెంబర్ 18** వినాయక చవితి సందర్భంగా డోన్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కోట్ల వారి గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు నిర్వహించిన గణేష్ లడ్డు వేలం పాటలో డోన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు టి.ఈ. రాఘవేంద్ర గౌడ్, అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా పాల్గొని రూ.1,01,000లకు లడ్డూను కైవసం చేసుకున్నారు.అంతకుముందు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో డోన్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా వివిధ పోటీలు, ప్రజల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్సవ నిర్వాహకులను పలువురు అభినందించారు.

## డోన్ లో ఘనంగా వినాయక నిమజ్జనం



**డోన్,నంది పత్రిక సెప్టెంబర్ 18**వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా డోన్ పట్టణంలో 350కి పైగా గణేష్ విగ్రహాలను అబ్బిరెడ్డిపల్లె చెరువులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నిమజ్జనానికి ముందు అబ్బిరెడ్డిపల్లె చెరువు వద్ద శాస్త్రోక్తంగా గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు కోట్రికె ఫణిరాజ్, ఆయన సతీమణి చేతుల మీదుగా గంగా హారతి నిర్వహించారు. సమితి కార్యదర్శులు సందు వెంకటరమణ, వై. హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో నిమజ్జన ఏర్పాట్లు కొనసాగాయి.పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా అబ్బిరెడ్డిపల్లె చెరువు వద్దకు తరలించి నిమజ్జనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో విగ్రహాలను నిమజ్జనం చేసి ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జ గణపయ్య సెలవిక



**కొత్తపల్లి – నంది పత్రిక :** వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.విగ్రహాలను భక్తులు, ప్రజలు గ్రామ పురవీధుల వెంట మేళతాళాల నడుమ ఊరేగింపుగా బయలు దేరారు. జై బోలో గణేష్ మహారాజ్ కి గణపతి బప్ప బోరియా అంటూ భక్తి పరావశ్యంతో గణపతిని వేడుకున్నారు. బొజ్జ గణపయ్య సెలవిక అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించారు.

## యువజన ఉత్సవాల్లో యువత తమ ప్రతిభను చాటాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 18(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న నంద్యాల జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ యువత తమ ప్రతిమను ప్రదర్శించడానికి యువజన ఉత్సవాలు అద్భుత వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 30 న యస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, నంద్యాల లో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఐదు విభాగాల్లో నిర్వహించబడతాయని.... వీటిలో 1) జానపద నృత్యం ((గ్రూప్), 2) జానపద గీతం ((గ్రూప్), 3) నాటక్ నుక్కడ్ , 4) పెయింటింగ్ 5) కవితా రచన ఉన్నాయని సెట్కూరు సీఈఓ డా కె. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, మరియు పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేయబడతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన యువతీ యువకులు తమ పేరు లేదా బృందం పేరును వెబ్ లింక్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, ఆన్లైన్లో నమోదు చేసుకోలేని వారు సెప్టెంబర్ 30న ఉదయం 8.30 గంటలలోపు నేరుగా కళాశాలలో వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్లు 92922 07601 లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సునీల్ సక్సెనా, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమ శివా రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్, జిల్లా క్రీడల అధికారి రాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మై భారత్ జిల్లా యువజన అధికారి ఐజయ్య, యస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ రెడ్డి ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డి , సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యామల పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన ధ్యేయం




### ప్రాధాన్యత క్రమంలో అన్నింటిని పరిష్కారం చేస్తాం
### సంబంధిత అధికారు లకు పరిష్కార చర్యలపై ఆదేశాలు జారీచేసిన ఎమ్మెల్యే
### రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక**
ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా సేవలందిస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె ా××జ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ లి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు ముందుగా స్థానిక మండల నాయకత్వానికి తెలియజేయాలని సూచించారు. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తన వద్దకు వస్తే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పలు రకాల మౌలిక సదుపాయాలు కల్పన కొరకు, పలు వ్యక్తిగత సమస్యలపై పలు వినతులు రాగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులకు చరవాణిలో మాట్లాడి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మరియు పరిష్కారం చేసిన పిదప తన దృష్టిలో పెట్టాలని సూచించారు. దరఖాస్తుదారులతో మాట్లాడిన ఆమె ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనతో చెప్పే అవకాశం ఉందన్నారు. తమ కార్యాలయంలో అయిన తెలియజేస్తే వెంటనే స్పందించి

పరిష్కారం చేస్తామన్నారు. కొన్ని సమస్యలపై పారదర్శకంగా ప్రాధాన్యత క్రమంలో అన్నింటిని క్రమానుగుణంగా పరిష్కారం చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఆమె వెంట ఏపీఐ ఐ సి డైరెక్టర్,మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, ఏఎంసి డైరెక్టర్ గట్టి మాణిక్యం, నియోజక వర్గ తెలుగు మహిళ నాయకులు ముప్పన సావిత్రి, నియోజక వర్గ బీసీ విభాగం ఉపాధ్యక్షులు మాకిరెడ్డి లోవరాజు, మండల తెలుగుయువత అధ్యక్షులు బారంగి అనుదీప్, మండల నాయకులు జెట్టి మధు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సూరిశెట్టి సురేష్, తెదేపా నాయకులు వానపల్లి చిట్టిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# కల్పిత నాయకుడు' పుస్తకాన్ని నిషేధించాలి






### మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు డిమాండ్

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలతో పుస్తకాన్ని రచించిన రచయిత హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని, ఆయన రాసిన "కల్పిత నాయకుడు" పుస్తకాన్ని వెంటనే బ్యాన్ చేయాలని మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, దళిత గిరిజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడ బందరు రోడ్డు లోని పిడబ్ల్యుడి గ్రౌండ్‌లో ఉన్న అంబేద్కర్ సమతా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు పాల్గొని మాట్లాడారు. "హమారా ప్రసాద్ అనే వ్యక్తి తీవ్రవాదిలా, ఉన్మాదిలా ప్రవర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా పూజలందుకుంటున్న అంబేద్కర్ పై దుర్మార్గమైన పుస్తకాన్ని రాశారు" అని మండిపడ్డారు. వాస్తవాలను వక్రీకరించి, అబద్ధాలను ప్రచారం చేస్తూ, అంబేద్కర్ ఉన్నతమైన శ్రమను, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ప్రపంచమంతా అంబేద్కర్ ఆదర్శాలను గౌరవిస్తుంటే, ఇలాంటి పుస్తకాలు రాయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పుస్తక రచయితపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయడంతో పాటు, ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని, పుస్తకాన్ని నిషేధించి రచయితను అరెస్ట్ చేసే వరకు వీధుల్లోనే ఉండి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్, మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొలకలూరి రమేష్,మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సామ్యూల్, గుంటూరు జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు రవీంద్ర పలు దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భీమవరంలోసరి రహదారి నిర్మాణానికి ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలి




### రూ.43 కోట్ల సీ ఆర్ ఎఫ్ నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక**
భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణం కోసం చేపడుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం సీ ఆర్ ఎఫ్ నిధుల నుంచి రూ.43 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో భీమవరం నుంచి లోసరి వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భీమవరం పట్టణంలోని డీ.ఎన్.ఆర్. కళాశాల, కే.జీ.ఆర్. కళాశాల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.17.45 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా గొల్లవానిదిబ్బ నుంచి రామాయణపురం వరకు రహదారి విస్తరణకు రూ.7.25 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. తోకతిప్ప, నాగేంద్రపురం ప్రాంతాల్లో రూ.8 కోట్ల వ్యయంతో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భీమవరం నుండి లోసరి రహదారిలో ప్రభుత్వం మంజూరు చేసిన అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ ప్రాంతాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా కోట్ల సూర్య జన్మదిన వేడుకలు.

### గాంధీ సర్కిల్ వద్ద అభిమానుల కోలాహలం.
### 75 కేక్ లను కట్ చేసిన నాయకులు, కార్యకర్తలు.



**డోన్,నంది పత్రిక సెప్టెంబర్ 18** మాజీ కేంద్ర మంత్రి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి 75వ జన్మదినోత్సవ వేడుకలు డోన్ పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల గాంధీ సర్కిల్ వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున వేడుకలను నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు సంఘీభావంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి 75 కేకులను కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి నిరంతరం ప్రజా సేవకే అంకితమై పనిచేస్తున్నారని కొనియాడారు. డోన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి ఎనలేనివన్నారు. నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రజా హృదయ విజేత కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, మరెన్నో జన్మదినాలు ఇలాగే ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అభిమాన జనం, పార్టీ శ్రేణులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కోట్ల పై తమకున్న అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు. గాంధీ సర్కిల్ పరిసర ప్రాంతాలన్నీ బాన సంచా కాలుస్తూ, డాన్సులు వేస్తూ, తప్పెట్లు మారుమోగుతూ జై కోట్ల.. జైజై కోట్ల నినాదాలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సలింద్ర శ్రీనివాసులు యాదవ్, మాజీ ఎంపీపీ టి శేషపని గౌడ్, మాజీ సర్పంచ్ అర్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు టి ఈ రాఘవేంద్ర గౌడ్, సింగల్ విండో చైర్మన్ చనుగొండ్ల శ్రీరాములు, ఓబులాపురం శేషరెడ్డి, నాగన్న పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## యువత భవితకు భరోసా..

### వడ్డు మధుసూదన్ రెడ్డి సేవలను అభినందించిన ఎంపీ డాక్టర్ శబరి



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 18:** మండల పరిధిలో ఉన్న ప్రభాత్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏ.కోడూరు టీడీపీ నాయకులు వడ్డు మధుసూదన్ రెడ్డి ఎంపీ డాక్టర్ శబరి వెంట పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలపై ఎంపీ శబరి ఆయనతో మాట్లాడారు. "మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను నేను గమనిస్తూనే ఉన్నాను. ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేయాలి. మీకు ఎలాంటి సహాయం అవసరమైనా నన్ను సంప్రదించండి" అని డాక్టర్ శబరి, వడ్డు మధుసూదన్ రెడ్డితో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రజా సేవతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మధుసూదన్ రెడ్డిని ఎంపీ శబరి అభినందించడం కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది. ఎంపీ తన సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రోత్సహించడంపై మధుసూదన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## ఆళ్లగడ్డలో శోభాయమానంగా గణేష్ నిమజ్జోత్సవం




**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 18 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలో గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. గత 5 రోజులుగా పూజలు అందుకున్న గణేష్ విగ్రహాలను శుక్రవారం పట్టణంలో డప్పులతో మేళతాళాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఆళ్లగడ్డ పట్టణంలో ఈ ఏడాది మొత్తం 70 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేయడం జరిగింది. గణేష్ కేంద్ర కమిటీ, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది విజయభాస్కర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది నీలకంటేశ్వరం ,మురళి గౌడ్ కమిటీ బృందం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిమజ్జనోత్సవం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆళ్లగడ్డ సమీపంలోని కాసింతల క్షేత్రంలోని కుంటలో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జరిగింది. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐలు నాగరాజరావు బివి రమణ ఎస్సైలు పోలీస్ సిబ్బందిలతో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ధాన్యం మద్దతు ధర కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### ఈ నెల 25లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ 100 శాతం పూర్తి చేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక** ఖరీఫ్ 202627 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సజావుగా కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామన్ వెరైటీ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,441, గ్రేడ్ఏ రకానికి రూ. 2,461 కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మూడు రోజుల్లో సెల్ఫ్ డిక్లరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తూనికలు, కొలతల పరికరాలను పరిశీలించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే మీటర్ల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లర్లు తమ డిక్లరేషన్ ప్రక్రియను మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు వినియోగించే వాహనదారులు కొనుగోలు కేంద్రాల్లో వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ధాన్యం ధరతో పాటు రవాణా చార్జీలను కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని జేసీ స్పష్టం చేశారు. జిల్లాలో ఈ–క్రాప్ 87 శాతం , ఈ–కేవైసీ 71 శాతం మాత్రమే పూర్తయిందని, ఈ నెల 25లోగా 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధరపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎం ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్. సరోజ, డీఏఓ జి. సునీత, డీసీఓ ఎస్. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛతా హి సేవా 2026ను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలి

### స్వచ్ఛతా హి సేవా2026 గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ,జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ




**మొగల్తూరు బ్యూరో చీఫ్ సెప్టెంబరు 18 నంది పత్రిక** జిల్లాలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ2026 గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ, తో పాటు ఆర్డీవో దాసిరాజు, డిపిఓ వై దోసిరెడ్డి, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు జిల్లా అధికారి ఏ వెంకటలక్ష్మి, హౌసింగ్ పిడి జి. పిచ్చయ్య, డి ఎల్ డి వో శ్యామల, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, మాట్లాడుతూ స్వచ్ఛతా హిసేవా ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెల రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతా హిసేవా 2026 కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, పట్టణ స్థానిక సంస్థలు, మండల స్థాయి అధికారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలను భాగస్వాములను చెయ్యాలని సూచించారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజల జీవన విధానంలో భాగంగా మార్చేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రమైన పరిసరాల పరిరక్షణ, ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు,

## ఏళ్ల నిరీక్షణకు తెర.. టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది.

## వివిధ వినాయక మండపాలను సందర్శించి పూజలు నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు అర్బన్‌లోని శరిన్ నగర్‌తో పాటు కల్లూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను సందర్శించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందిన పాణ్యశీ నియోజకవర్గం ఎమ్మెల్యే,టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డ మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 18 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని ఆళ్లగడ్డ మండలం పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తాను ఎంపీపీగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో ఆళ్లగడ్డ మండల అభివృద్ధికి కృషి చేశానని ఇందుకు సహకరించిన అధికారులందరూ ఇలాగే ఆళ్లగడ్డ మండల అభివృద్ధికి తమ వంతుగా పాటుపడాలని ఆయన తెలిపారు. అభివృద్ధికి సహకరించిన అధికారులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల పదవి కాలం త్వరలో ముగియనుండటంతో అధికారులు ఎంపీపీ తో పాటు ఎంపీటీసీ సభ్యులకు శాలువాతో సత్కరించి మేమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్ బేగం జడ్పిటిసి సభ్యులు లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ నాసారి లక్ష్మి నరసింహ ప్రసాద్, ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అంతర్వేది పవిత్రోత్సవాలకు వినియోగించే పవిత్రాలకు అహోబిలంలో ప్రత్యేక పూజలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 18 నంది పత్రిక** :తూర్పుగోదావరి జిల్లాలోని అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలకు వినియోగించే పవిత్ర మాలలను అహోబిలంలో శుక్రవారం లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంతర్వేది తీసుకువెళ్లారు. అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి పవిత్రోత్సవాలు పవిత్ర మాలలకు గత కొన్ని సంవత్సరాల నుండి రంగారావు గోష్టి సభ్యుల తరపున పవిత్రమాలను అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి పాదాల చెంత ఉంచి ఆ పవిత్రమాలలను అంతర్వేది అర్చకులకు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో అహోబిలం దేవస్థానం ముద్రకర్త, ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలచార్యులు, మనియర్ సౌమ్య నారాయణన్ స్వామి, అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం నుండి అహోబిలం కు వచ్చిన ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకెటిఎన్వి ప్రసాద్ , ఆలయ స్థాన చార్యులు రామరంగాచార్యులు, ఆలయ ముఖ్య అర్చక పెద్దింటి రామా శేషాచార్యులు మరియు ఆలయ సిబ్బంది సిహెచ్ ప్రసాద్ కి పవిత్రమాలలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రంగారావు గోష్టి సభ్యులు ఏడిఈ రవికాంత్ చౌదరి, ఉప్పల ప్రసాదు, అవ్వారు గౌరీనాథ్, వీరచంద్ర, సి.నరసయ్య , సుబ్రహ్మణ్యం, లోకేష్, నరేంద్ర, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించడమే ప్రత్యేక పిజిఆర్ఎస్ లక్ష్యం







### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**మొగల్తూరు బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక**

ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి లో నిర్వహించిన 2 వ ప్రత్యేక పి జి ఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలతో నేరుగ మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో వచ్చిన ప్రజల నుండి 124 ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, పిజిఆర్ఎస్ ద్వారా వారి సమస్యలను స్వీకరించి నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏ సమస్య ఏ శాఖకు సంబంధించినదో గుర్తించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. పి జి ఆర్ ఎస్ లో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ లో నమోదు చేసి, దాని పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఫిర్యాదుదారునికి సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడం, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం అధికారుల ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో చేయవలసిన అభివృద్ధి పనులు పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు.

**స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని** మొగల్తూరు మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన చిర్ల వెంకట సుబ్బలక్ష్మి తన భర్త నుంచి విడాకులు పొంది ఒంటరిగా జీవిస్తున్నాను ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని కోరారు. నరసాపురం మండలం చామకూరిపాలెం పంచాయతీ కొండవీటి కొడప గ్రామానికి చెందిన ఆచంట సత్యనారాయణ తన రేషన్ కార్డులో చిన్న కుమార్తెతో పాటు ఆమె భర్త, అత్తగారి పేర్లు కూడా నమోదై ఉన్నాయని దీంతో తాను పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పుడు అనర్హుడిగా చూపిస్తున్నారనితన రేషన్ కార్డు నుండి వారి పేర్లను తొలగించి, అర్హత మేరకు తనకు పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని నక్కవారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు చెందిన కె.వి. సత్యనారాయణ, ఐ. దుర్గారావు, కె. ఆనందరావు తదితరులు6 మొగల్తూరు నుంచి పడమటిపాలెం, కొత్తపాలెం మీదుగా భీమవరం వెళ్లే ప్రధాన రహదారి మరియు మొగల్తూరు గొల్లగూడెం నుంచి నక్కవారిపాలెం వెళ్లే అడ్డరోడ్డు పూర్తిగా పాడైపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రహదారులను నిర్మించి గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు నరసాపురం మండలం సీతారామపురం గ్రామం కొత్తపేటకు చెందిన తమనం రాజేశ్వరి తనకు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఉందని తెలిపారు. తన ఇంటి స్థలానికి సంబంధించిన సరిహద్దు గోడపై సరిహద్దుదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి తొలగించి, తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ దాసిరాజు, డి పి ఓ దోసిరెడ్డి, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు జిల్లా అధికారి ఎ వెంకట లక్ష్మీ, తాసిల్దార్లు ఎండి అబ్దుల్ ఫరూక్ , నాగార్జున, ఎంపీడీవో సి హెచ్ త్రిశూలపాణి, నరసాపురం నియోజకవర్గం టి డి పి ఇన్చార్జి పొత్తూరి రామరాజు,వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కెమెరా వెనుక నిలిచి.. చరిత్రను ముందుకు చూపి..

**- కనిపించే దృశ్యానికి కళారూపం..**
**ఫొటోగ్రాఫర్ ప్రతిభకు ప్రతిరూపం**
**- సమాజంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక** ఒక క్షణాన్ని కెమెరాలో బంధించి, దాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలిపే శక్తి ఫొటోగ్రాఫర్లకు ఉందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఒక క్షణాన్ని శాశ్వతంగా బంధించి ఆ క్షణంలోని భావోద్వేగాన్ని, సంఘటనను, చరిత్రను భావితరాలకు అందించే అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ అని పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, వారసత్వం, పర్యాటకం, యువత, పీ4, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, ఉత్తమ న్యూస్ పిక్చర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా మొత్తం 221 ఛాయాచిత్రాల ఎంట్రీలుగా రాగా. వాటిలో 27 ఉత్తమ ఛాయాచిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు. వీరికి ఆగస్టు 19న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అతిథులతో కలిసి నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. వ్యక్తిగత కారణాల వలన కార్యక్రమానికి హాజరై బహుమతులు అందుకోలేక పోయిన విజేతలకు పోటీల్లో పాల్గొన్నవారికి శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక పరిణామాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలను తమ కెమెరా కళ్లతో ప్రపంచానికి పరిచయం చేస్తున్న ఫొటో జర్నలిస్టుల సేవలు అభినందనీయమని తెలిపారు. వార్తా కథనానికి దృశ్యరూపాన్ని అందించడం ద్వారా ప్రజలకు విషయాన్ని మరింత స్పష్టంగా అర్థమయ్యేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని లక్ష్మీశ చెప్పారు. ఇలాంటి గొప్ప కళను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్వో కేవీ రమణరావు, డీపీఆర్వో టి నాగేశ్వరరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఫొటోగ్రఫీ పోటీల సమన్వయకర్త వీవీ ప్రసాద్, జ్యూరీ సభ్యులు సీనియర్ ఫొటో జర్నలిస్ట్ సీహెచ్ విజయ భాస్కర్, ఫొటో జర్నలిస్టులు కె వి.ఎస్ గిరి, జీవీ నారాయణ, టీవీ రమణ, ఎస్.నాగభూషణం, సీహెచ్. వెంకట్రామయ్య, ఎ. శ్రీనివాసమూర్తి , శ్రీనివాసరావు, శ్రీహరి తదితరులను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సత్కరించి ప్రశంసా పత్రాల ను అందజేశారు.



# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధమ మహా సభకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆహ్వానం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 18 నంది పత్రిక** జిల్లా కేంద్రమైన నంద్యాలలో రామకృష్ణ డిగ్రీ కాలేజీ వివేకానంద ఆడిటోరియం లో ఈ నెల 20న ఆదివారం జరిగే ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధమ మహాసభకు రావాలని శుక్రవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వగృహంలో శుక్రవారం ఆళ్లగడ్డ తాలూకా శాఖ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు ముల్లా నిజాముద్దీన్, తాలూకా ట్రెజరర్ నాగరాజు లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కరపత్రం అందజేసి ఆహ్వానించారు.

# మహానంది అమ్మవారికి హైదరాబాద్ భక్తుల పట్టు వస్త్రాలు సమర్పణ

**15 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం**



**మహానంది సెప్టెంబర్ 18 (నంది పత్రిక):-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో త్వరలో ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ కామేశ్వరీ అమ్మవారికి అలంకరించడానికి హైదరాబాద్ కు చెందిన ప్రముఖ భక్తులు వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు 10 పట్టుచీరలను బహూకరించారు. ఈ పట్టువస్త్రాలను వారి కుమార్తె, అల్లుడు అయిన ప్రెక్కి శ్రీనివాస సుధాకర్, మీనాక్షి సుబ్బలక్ష్మి రాధ ద్వారా మహానంది క్షేత్రానికి పంపించారు. ఆలయానికి చేరుకున్న వీరు ఈ పట్టు చీరలను మహానంది ఆలయ చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా దేవస్థానానికి అప్పగించారు. వారణాసి రామ్మోహన్ రావు కుటుంబ సభ్యులు గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించడాన్ని ఒక భక్తి పూర్వక సంప్రదాయంగా కొనసాగిస్తుండటం విశేషం. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు ,ఆలయ అధికారులు,అర్చకులుపాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట





**'ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు'**
**కార్యక్రమంలో నమోదైన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి**
**ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలి**
**క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలకు సత్వర న్యాయం అందించాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**చందర్లపాడు బ్యూరో చీఫ్: సెప్టెంబర్ 18, నంది పత్రిక** ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యలను కేవలం అర్జీల పరిష్కారంగా కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. 'ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు తునికిపాటి ఫంక్షన్ హాల్ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి నాలుగు సార్లు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడులో 'ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై పకడ్బందీగా, పూర్తి స్థాయి విచారణ జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, పంచాయతీరాజ్‌కు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న అనంతరం నిబంధనల మేరకు ప్రజలకు అనుకూలంగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే కాకుండా, భవిష్యత్తులో అదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్ తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం అందించడమే 'ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవం:

**పోటాపోటీగా లడ్డూ వేలం పాటలు**

**పటిష్ట బందోబస్తు నిర్వహించిన ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి**



**మహానంది సెప్టెంబర్ 18 (నంది పత్రిక ):-** మహానంది మండలం పరిధిలోని అబ్బీపురం, మహానంది, శ్రీనగరం గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం వేడుకలను భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న గణనాథులకు గురువారం తుది పూజలు పూర్తి చేశారు. అనంతరం జరిగిన శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సందడి చేశారు. మంగళ వాయిద్యాలు, డప్పు మేళతాళాల నడుమ గణపతులను గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య మహానంది తెలుగు గంగ ప్రధాన కాలువలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోటాపోటీగా లడ్డూల వేలం:నిమజ్జనానికి ముందు పలుచోట్ల వినాయక మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ ప్రసాదం వేలం పాటల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. శ్రీనగరం గ్రామంలో జరిగిన వేలంలో అత్యధికంగా భక్తుడు నడిపి హుస్సేన్ రూ. 51,000 కు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే అబ్బీపురం గ్రామ శివాలయం వద్ద నిర్వహించిన వేలంలో బోయ స్వామి రూ. 26,500 కు లడ్డూ ప్రసాదాన్ని పాడుకున్నారు. నిమజ్జనోత్సవ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించారు. దీంతో వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.



# నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు

**అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేయాలి**
**పింఛన్ మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసినా, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినా కఠిన చర్యలు**
**స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ పథకంలో భాగంగా పెంచిన పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు, నూతనంగా అర్హత పొందిన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. చందర్లపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న సందర్భంలో మార్గమధ్యంలో సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్‌లైన్ అప్రూవల్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 18వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేసి, నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేసే ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారం లేదా ఆన్‌లైన్ అప్రూవల్ కోసం లబ్ధిదారుల నుంచి ఎటువంటి రుసుములు, డబ్బులు డిమాండ్ చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు ఆశించడం, దరఖాస్తుల పరిష్కారంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం, అధికారిక ప్రక్రియను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం లేదా "పింఛన్ నేనే చేయాలి.. నేను చేయకపోతే అవ్వదు" అనే విధంగా వ్యవహరించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బందిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి, అర్హత ఉన్న లబ్ధిదారులకు పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా అనవసర కారణాలతో పింఛన్ ప్రయోజనం కోల్పోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత లేని దరఖాస్తులను నిబంధనల ప్రకారం మాత్రమే పరిష్కరించాలని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్రూవల్ ప్రక్రియలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది కీలక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.



దరఖాస్తుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అర్హత నిర్ధారణ, ఆన్‌లైన్ అప్రూవల్ తదితర అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో అర్హులైన లబ్ధిదారుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క దరఖాస్తు కూడా నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉండకూడదని, అర్హత ఉన్నప్పటికీ అనవసరంగా తిరస్కరణకు గురికాకూడదని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించడంలో విఫలమయ్యే సిబ్బందిపై బాధ్యతను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడికి మాత్రమే పింఛన్ పొందే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఒకే కుటుంబంలో అర్హత కలిగిన ఇతర సభ్యులకు కూడా పింఛన్ మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం పరిశీలనలో ఉంచినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబంలో అర్హత కలిగిన ఒక లబ్ధిదారుడికి పింఛన్ ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకే డ్రామాలు



సిద్దిపేట భూముల వివాదం, జరుగుతున్న పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కరీంనగర్లో ఈ రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కబ్జాకు సంబంధించి ఆధారాలు ఉంటే భూములను వెంటనే స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం సహా భూములు కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లిం చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపిం చారు. కేసీఆర్తో డీల్ కుదుర్చుకోవడానికే అసెంబ్లీలో సెట్ వేశారా అని సెటైర్లు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందేనని విమర్శించారు. బీఆర్ఎస్ భూ దోపిడీపై త్వరలోనే దండయాత్ర చేస్తామని ప్రకటించారు.

# 22ఏ విచారణకు ఫాస్ట్ ట్రాక్ కమిటీ ఏర్పాటు

**- చైర్మన్ సీసీఎల్ఎ కమిషనర్ లోకేశ్ కుమార్ సభ్యులుగా మరో ఇద్దరు ఉన్నతాధికారులు,**

**- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి,**

**- 118 జీవో ప్రకారం 19నుంచి రెగ్యులరైజేషన్ పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ,**

**- అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి ప్రకటన,**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22-ఏ కు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం నాడు శాసనసభలో ప్రకటించారు. ఇందుకు సంబంధించి జీ.ఓ. నెం. 564ను జారీచేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్ గా సిసిఎల్ఎ డి.ఎస్. లోకేష్ కుమార్ వ్యవహరిస్తారు. లా సెక్రటరీ, పాపి రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐ.జీ. రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారని మంత్రినితెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా ఆనాడు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఉన్న రెగ్యులరైజేషన్ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో 118 జీ.ఓ. ప్రకారం 9,700 ప్లాట్ల రేగ్యులరైజేషన్ కు సంబంధించిన మెమోను శుక్రవారం జారీ చేయడం జరిగిందన్నారు. ఈ జీ.ఓ. ప్రకారం ఆ ప్రాంతంలో రేపటి నుంచి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. దశాబ్దాల కాలంగా అక్కడ ప్లాట్లు తీసుకొని ఇండ్ల నిర్మాణం చేసుకొనినివాసం ఉంటున్న ఇండ్ల యజమానులు 118 జీ.ఓ. ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రాంతంలో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ కు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో 76ను జారీ చేశారని ఆ జీవోను అనుసరించి శనివారం నాడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే రెవెన్యూ రికార్డులలో 22ఎలో ఉండి హెచ్ఎండిఎ, డిటిసిపి, జిహెచ్ఎంసీ అనుమతులతో లేఅవుట్లు వేసిన ప్రాంతాలను 22ఎ నుంచి తొలగించే విషయంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించిన 12 అంశాలపై నెలరోజుల వ్యవధిలోనే నిర్ణయం తీసుకొని 22ఎ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని సభలో ప్రకటించారు.



## 62 అడుగుల మట్టి గణనాథుని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహం ఏర్పాటు అభినందనీయం**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**పాలకొల్లు బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 18 నంది పత్రిక** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ 62 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.పాలకొల్లు పట్టణంలోని లాకు సెంటర్ రెల్లి పేటలో రెల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 62 అడుగుల గణనాథుని మట్టి విగ్రహాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రెల్లి యువజన సంఘం మహిళలు దారి పొడవునా పూలు జల్లుతూ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు.అనంతరం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందుకున్నారు. రెల్లి పేటలో మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ నాగరాణి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి కోరిక మేరకు వారితో కలిసి ఫొటోలు దిగడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా 62 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ పెయింట్స్ మాత్రమే వినియోగించడం శుభపరిణామమని అన్నారు. ఇందుకు ఉత్సవ కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. గణనాథుని విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి ఇంటి ప్రసాద్‌ను కూడా కలెక్టర్ అభినందించారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులు పశ్చిమగోదావరి జిల్లా ప్రజలందరిపై ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే అంగర రామ్మోహన్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సీఐ రజనీకుమార్, రెల్లి యువజన సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వెంటనే ప్రారంభించాలి

**- అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు,**

వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంపై వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే, కే.ఆర్. నాగరాజు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యను అందించాలనే ఉద్దేశంతో వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్ల మేర పరిపాలనా



అనుమతులు మంజూరు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఎదురుచూపులు నెలకొన్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు గారు ప్రభుత్వాన్ని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను వేగవంతం చేసి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ఉచిత బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం ప్రవేశ పెట్టడం అభినందనీయం,ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లలో భవన నిర్మాణాలు కాంపౌండ్ వాల్స్ ఇతర మౌలిక వసతులతో పాటు రాత్రి వేళలు కూడా సెక్యూరిటీ సిబ్బందిలను ఏర్పాటు చేయాలని సభలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

## వినాయక చవితి సందర్భంగా ఘనంగా అన్నదానం

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం,కాజీపేట మండలం పరిధిలోని 47వ డివిజన్‌లో అక్షర స్కూల్ డైరెక్టర్లు రజిడి నవీన్ రెడ్డి అనిత రెడ్డి వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జంగా రాఘవరెడ్డి వారి సతీమణి జంగా సుజాత రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందించారు.ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ,వినాయక చవితి వంటి పర్వదినాల్లో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు అన్నదానం,సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు, అక్షర స్కూల్ సిబ్బంది,భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రేషన్‌కార్డు ఉన్న వారికి బిగ్ షాక్

**- వీరి రేషన్ నిలిపివేత..!**

) రేషన్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన ఆదేశం జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ పీడీఎస్ పథకం వచ్చే నెల నుంచి అమలులోకి రానుంది.దీనితో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులు రద్దు కానున్నాయి. కనీసం ఆరు లక్షలకు పైగా కార్డులు రద్దు కానున్నాయని సమాచారం. ఆరు నెలలకు పైగా రేషన్ తీసుకోని కార్డుదారులపై ఈ ప్రభావం పడనుంది. ఆరు నెలలకు పైగా ఉపయోగించని కార్డులు 16 లక్షలకు పైగా ఉన్నాయి. ఉపయోగించని కార్డులను యాక్టివేట్ చేయడానికి, కేవైసీని అప్‌డేట్ చేయాలి. స్మార్ట్ పీడీఎస్ అనేది రేషన్ కార్డు సభ్యుల సమాచారాన్ని కేంద్రంగా నిల్వ చేయడానికి, క్షేత్రస్థాయి వరకు పంపిణీని పూర్తిగా పర్యవేక్షించడానికి రూపొందించిన ఒక ప్రాజెక్ట్.బి

**ఆరు నెలలుగా రేషన్ తీసుకోలేదా?** ఈ చర్యలు ప్రధానంగా ఆరు నెలలకు పైగా రేషన్ తీసుకోని వారిని ప్రభావితం చేస్తాయి. ఆరు నెలలకు పైగా తమ రేషన్ వాటాను తీసుకోని వారి కార్డులు నిలిచిపోయే అవకాశం ఉంది. దీని తర్వాత కార్డులోని సభ్యులందరూ మూడు నెలల్లోగా ఇ-కెవైసిని పూర్తి చేయాలి. అప్పుడే రేషన్ పంపిణీని తిరిగి పొందవచ్చు. అంతేకాకుండా, ఒకే వ్యక్తి ఏదైనా రాష్ట్రంలో ఒకటి కంటే ఎక్కువ కార్డులలో ఉన్నారా లేదా అనే విషయాన్ని కూడా ఇది గుర్తిస్తుంది. ఒకవేళ అలా ఉంటే, వారి కార్డులు నిలిచిపోయే అవకాశం ఉంది. వారు మూడు నెలల్లోగా వఫ్‌జని కూడా పూర్తి



చేయాల్సి ఉంటుంది. ఈ దశలో ఏ రేషన్ కార్డును ఉంచుకోవాలో నిర్ణయించి, మిగిలిన వాటి నుండి వారి పేరును తొలగించాలి.

ఈ చర్యలు స్మార్ట్ పీడీఎస్ పథకం మొదటి దశలోని పసుపు, గులాబీ వర్గాలపై ప్రభావం చూపుతాయి. కేరళలో ఈ వర్గాలలో సుమారు 45,000 కార్డులు, 66,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఆరు నెలలకు పైగా రేషన్ అందలేదు.

లక్షలాది నీలం, గోధుమ, తెలుపు కార్డులుదారులు కూడా ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోలేదని గుర్తించారు అధికారులు. దీంతో వారి కార్డులను నిలిపివేసే అవకాశం ఉంది.

## టైమ్ కు ఆఫీస్ కు రాకపోతే.. గేటు బయటే!

ప్రజా సమస్యల పరిష్కార వేదికైన కలెక్టరేట్ లో ఉద్యోగుల నిర్లక్ష్యానికి, సమయపాలన లేమికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా యంత్రాంగం కఠిన వైఖరి అవలంబించింది. విధులకు సమయానికి హాజరుకాని ఉద్యోగులపై యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ భాస్కరావు కొరడా ఝుళి పించారు. ఈ ఉదయం 10:30 గంటలు దాటినా కార్యాలయానికి రాని వారిని లోపలికి అనుమతిం చకుండా కలెక్టరేట్ ప్రధాన గేటుకు తాళం వేయిం చారు. ఆ తర్వాత వచ్చిన పలువురు ఉద్యోగులు గేటు బయటే నిలబడిన పరిస్థితి తలెత్తింది. తాళం వేసి ఉండడాన్ని చూసి వారు ఖంగుతిన్నారు.కలెక్టర్ తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంతో కలెక్ట రేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఉద్యోగుల సమయపాలనను పక్కాగా అమలు చేసేందుకు ఇప్పటికే జిల్లా యంత్రాంగం లొకేషన్ ఆధారిత హాజరు యాప్ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. అయినప్పటికీ పలువురు ఉద్యోగుల పనితీరులో ఎలాంటి మార్పు రాలేదని, నిర్దేశిత సమయానికి రాకుండా నిర్లక్ష్యం వహిస్తు న్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు ఎల్లప్పుడూ జవాబుదారీగా ఉండాల్సిన ఉద్యోగులు ఆలస్యంగా రావడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కలెక్టర్, సమయపాలన పాటించేలా చేసేందుకు ఈ చర్య చేపట్టినట్లు సమాచారం.

## యూపీఐ చార్జీల నుంచి డీలర్లకు మినహాయింపు ఇవ్వాలి

**- తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు,**



రైతులకు అవసరమైన ఎరువులు,పురుగు మందులు, విత్తనాల విక్రయాలపై ఆధారపడి వ్యాపారం నిర్వహిస్తున్న డీలర్లకు యూపీఐ లావాదేవీలకు సంబంధించిన చార్జీల నుంచి మినహాయింపు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులవినియోగం రోజురోజుకూ పెరుగుతోందని వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలోనూ రైతులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారని ఆయన తెలిపారు.ముఖ్యంగాఎరువులు,పురుగుమందులు విత్తనాల విక్రయాల్లో డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో డీలర్లపై అదనపు లావాదేవీ వ్యయాలు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారురైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్పుట్స్ ను అందించడంలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని సకాలంలో పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి సంబంధించిన వ్యాపార లావాదేవీలను ప్రోత్సహించే విధంగాఎరువులు,పురుగుమందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన యూపీఐ చెల్లింపులపై డీలర్లకు ప్రత్యేక మినహాయింపు లేదా రాయితీ విధానం అమలు చేయాలని కోరారు.డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలతో సమన్వయం చేసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని నాగుర్ల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను అందించడంతో పాటు డీలర్లపై అనవసరమైన అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని ఆయన కోరారు.

# రేవంత్ రెడ్డికి కేసీఆర్ రూ.1000 కోట్ల ఆఫర్!..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణం మరియు నిర్వహణపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పేరుతో భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని, లక్ష కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆయన పదే పదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అధికార వర్గాల నుంచి వస్తున్న విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో మరోమారు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల నుంచి తీవ్రస్థాయిలో స్పందన వెలువడింది. ముఖ్యమంత్రికి తాము ఒక వినూత్నమైన ప్రతిపాదన ఇస్తున్నామని, కేవలం వెయ్యి కోట్లు మాత్రమే తమకు ఇస్తే మొత్తం ప్రాజెక్టును వారికి అప్పగించేస్తామని ప్రత్యర్థులు సవాల్ విసిరారు. మిగిలిన తొంభై తొమ్మిది వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వివిధ సంక్షేమ హామీల అమలు కోసం ఖర్చు చేసుకోవచ్చని సూచించారు. కాళేశ్వర ప్రాజెక్టు విషయంలో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ రాష్ట్రవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవాలను వక్రీకరిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణంపై అనవసరమైన రాద్ధాంతం మానుకోవాలని స్పష్టం చేశారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, అంచనాలే ప్రధాన ధ్యేయంగా అడుగులు వేస్తోంది. పాలనాపరమైన నిర్ణయాల్లో పారదర్శకత పాటిస్తూ ముందుకు వెళ్తున్నామని యంత్రాంగం చెబుతోంది. ఏదేమైనప్పటికీ ఈ ప్రాజెక్టు చుట్టూ అలుముకున్న రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల పర్వం ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మరింత వేడెక్కే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.





printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com